VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం A 193

# విశాలాంధ్ర

సంపుటి 7 * విజయవాడ గురువారం చైత్రం 20-1880 [ఏప్రిల్ 10-1958] * సంచిక 20

### దేశంలోని వ్యవసాయ కళాశాలల అభివృద్ధికి భారత ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9

కేంద్రంలోని వ్యవసాయ పరిశోధనా సంస్థని, దేశంలో 4 వ్యవసాయ కళాశాలల్ని - వ్యవసాయ రాష్ట్రంలో పోస్టు గ్రాడ్యుయేట్ విద్యాసంస్థలుగా అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం ప్రణాళికా సంఘంతో సంప్రదించినమీదట నిర్ణయించినట్లు కేంద్ర సహకార మంత్రి పంజాబ్‌రావ్ దేశముఖ్ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

### ఐ రా స ఆధ్వర్యాన అఖిల కొరియా ఎన్నికలు

చైనాకు ఐ రా స లేఖ

పెకింగ్, ఏప్రిల్ 9

ఐ రా స ఆధ్వర్యాన అఖిల కొరియా ఎన్నికలు జరపడానికి ఉత్తర కొరియా సమ్మతిస్తుందో లేదో తెలుసుకోవలసిందని ఐ రా స కార్యాలయం వారు నవచైనా ప్రభుత్వానికి నేడొక లేఖ పంపించారు.

# పాటవ పరీక్షలను రష్యా విరమించినందుకు నెహ్రూ హర్షం

## దీనివల్ల ప్రపంచంలో ఉద్రిక్త వాతావరణం తొలగిపోగలదని ఆశాభావం

## లోక్‌సభలో విదేశాంగశాఖ పద్దుపై చర్చను ప్రారంభిస్తూ ప్రధాని ప్రసంగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9

అణ్వాయుధ పాటవపరీక్షలను నిలవడానికీ, వాటి నిలువదల చర్యపై తనిఖీకి ఒప్పందం కుదుర్చుకొనడానికీ సోవియట్ యూనియన్ నిర్ణయించినందుకు ప్రధాని నెహ్రూ నేడు హర్షం వెలిబుచ్చారు.

అలాగే అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వాడాలని అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ చేసిన ప్రతిపాదనను కూడా నెహ్రూ అభినందించారు.

ఈప్రతిపాదన లన్నింటినీ కలిపి తగుచర్యలు కైకొంటే నేడున్న భయభీత వాతావరణం ఉద్రిక్తత తొలగి ఒక కొత్త వాతావరణం నెలకొంటుందని ఆయన అన్నారు.

ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో విదేశాంగ పద్దుపై చర్చను ప్రారంభిస్తూ పైవిషయాల్ని పేర్కొన్నారు.

అణ్వాయుధ పాటవ పరీక్షలు ఎవరికీ తెలియకుండా జరపడం సాధ్యమూ, అసాధ్యమూ అన్న విషయాన్ని పరిశీలించడంలో సంప్రఖ్యాత విజ్ఞాన శాస్త్రవేత్తలతో ఐ రా స కాని మరొక సంస్థ కాని ఒక సంఘాన్ని నియమించాలని శ్రీ నెహ్రూ సూచించారు.

లంకలోని భారతీయులసమస్యను మానవ కారుణ్య దృష్టితో పరిశీలించవలసిందే కాని రాజకీయ సమస్యగా దాన్ని చూడరాదని లంక ప్రభుత్వమూ, ప్రజలూ కూడా మనలాగే గుర్తిస్తున్నారని శ్రీ నెహ్రూ చెప్పారు.

భారతీయులకు అనుకూలంగా ఈ సమస్య పరిష్కారం కాగలదన్న ఆశాభావం ఆయన వెలిబుచ్చారు. లంకలో పుట్టి అక్కడ పెరిగిన ఈ భారతీయులు ఎక్కువమంది మన దేశానికి తిరిగి రావడం సంచితికాదన్నారు.

### టోగ్లియాటీ అస్వస్థత

రోమ్, ఏప్రిల్ 6

ఇటలీ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు టోగ్లియాటీ ఇన్‌ఫ్లూయంజా జ్వరంతో బాధ పడుతున్నారు. ఆయన కొన్నాళ్లపాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సలహాయిచ్చారు.

టోగ్లియాటీ వయస్సు 65 సంవత్సరాలు.

ఇటలీలో జరుగబోయే జనరల్ ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని రూపొందించేందుకు జరిగిన పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో టోగ్లియాటీ పాల్గొనలేకపోయారు.

### రష్యా చర్యకు హామర్షెల్డ్ హర్షం

న్యూయార్క్, ఏప్రిల్ 8

అణ్వస్త్ర పాటవ పరీక్షలను ఆపివేస్తూ సోవియట్ ఏకపక్ష నిర్ణయం చేసినందుకు ఐ రా స ప్రధాన కార్యదర్శి హామర్షెల్డ్ నేడు తన హర్షం తెలిపారు.

### అణ్వస్త్ర ప్రతికూల ప్రదర్శన సమాప్తి

ఎల్డర్‌మస్టన్, ఏప్రిల్ 7

నాలుగు రోజులక్రితం లండన్ నుంచి కాలినడకను బయలుదేరిన 8 వేలమంది అణ్వస్త్ర ప్రతికూల ప్రదర్శకులు 50 మైళ్లు నడచి నేడు గమ్యస్థానం చేరుకున్నారు.

### సౌదీ అరేబియా భారతదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

భారత, సౌదీఅరేబియా దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించే నిమిత్తం ఉభయదేశాల ప్రతినిధులు నేడొక ఒప్పందంపై సంతకాలు చేశారు.

సౌదీ అరేబియా వాణిజ్య ప్రతినిధి వర్గంవారు కతేలెలో భారత ప్రభుత్వంతో జరిపిన సంప్రతింపుల ఫలితంగా యీ ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందం ప్రకారం భారత దేశంనుంచి విద్యుత్ పంకాలు, పంపు సెట్టులు, కుట్టుయంత్రాలు, ఎయిర్ కండిషనర్లు, డీజిల్ యింజన్లు, డ్రై బ్యాటరీలు, విద్యుత్ పరికరాలు, వ్యవసాయ పరికరాలు మున్నగు వాటిని సౌదీ అరేబియాకు ఎగుమతి చేస్తారు.

### ప్రధాని నెహ్రూ అభినందన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9

పాల్ రాబ్సన్ షష్టిపూర్తి సందర్భంలో ప్రధాని నెహ్రూ ఒక అభినందన సందేశం పంపారు.

ఆ సందేశంలో ఇలావుంది:

పాల్ రాబ్సన్ షష్టిపూర్తి ఉత్సవాన్ని జరపడానికి ప్రముఖ న్యాయమూర్తి శ్రీ చాగ్లా అధ్యక్షతన ఒక అఖిలభారత కమిటీ ఏర్పడిందని తెలిసి సంతోషిస్తున్నాను. పాల్ రాబ్సన్ మన తరంలోని మహా కళాకారుల్లో ఒకడనేకాక కళ, మానవతా జాతిమత కర్గ విభేదాలకు అతీతమైన పని ఈ ఉత్సవాలు వ్యక్తపరస్తాయి కనుక ఈ షష్టిపూర్తి ఉత్సవాన్ని జరపడం చాలా సముచితం.

ఈ సందర్భంలో పాల్ రాబ్సన్‌కి నా శుభాకాంక్షలు. ఆయన తన అనన్య సామాన్య కళా కౌశలంతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించడం కోసం చిరాయుష్మంతు డగుగాక!

## మధుర గాయకుడు పాల్ రాబ్సన్ షష్టిపూర్తి

### "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా ఆయుష్మాన్ భవ!"

ప్రపంచ ప్రఖ్యాతిచెందిన అమెరికన్ గాయకుడు, కళాకారుడు, స్వాతంత్ర్యయోధుడూ అయిన పాల్ రాబ్సన్ నేడు షష్టిపూర్తి ఉత్సవం జరుపుకుంటున్నారు. ఈసందర్భంలో పాల్ రాబ్సన్ దీర్ఘాయుష్మంతుడు గావాలని 'విశాలాంధ్ర' శుభాకాంక్షలందజేస్తున్నది. తన గానమాధుర్యంచే యావత్ ప్రపంచాన్ని పులకితంచేస్తూ మానవాళిలో గర్భితమైవున్న శాంతిప్రియత్వాన్నీ, స్వాతంత్ర్య కాంక్షనూ ఉద్దీపింపజేస్తున్న పాల్ రాబ్సన్ మహోన్నత సేవకు 'విశాలాంధ్ర' నివాళి లర్పిస్తున్నది.

"నేనిక్కడ ఉన్నాను" అనే గ్రంథంలో ఆయన వెల్లడించిన అభిప్రాయాలను కొన్నింటిని నేడు ఆంధ్ర మహాజనులకు అందజేయగలుగుతున్నందుకు సంతోషిస్తున్నాం.

'నేను కళాకారుణ్ణి. ఆఫ్రికా సంస్కృతిపట్ల నాకు ప్రధాన ఆసక్తి వుండడం సహజం. అసలు ఆఫ్రికాలో సంస్కృతి అనేదే లేదని ఆ మహాఖండాన్ని పాలిస్తున్న విదేశీయులు చెపుతున్నారు.

సంస్కృతికోసం నేను పాగిస్తున్న పోరాటానికి గల శక్తి నాకన్నముందు ఇతరులే తెలుసుకొన్నారు. నా కార్యకలాపాలకు రాజకీయ వ్యాఖ్యానాలు చేస్తూ ఒకరోజున బ్రిటిష్ గూఢచారి శాఖవారు నన్ను హెచ్చరించారు.

ఆఫ్రికా సంస్కృతిని గురించి నేను చెపుతున్న వ్యాఖ్యానాన్ని అంగీకరిస్తే ఆఫ్రికావారు ఇంకొకవేయేండ్లకు కాని స్వయం పాలనకు అర్హత పొందరు అని తెల్లజాతులు చేస్తున్న వాదనగతి ఏంకావాలి?

పరే నేను 1934 లో మొదటిసారి సోవియట్ యూనియన్‌ని సందర్శించాను. అంతకుముందు పాలకుల పదఘాతాలక్రిందనలిగిపడివున్న యాకుత్ ప్రజలు ఉజ్బెక్ ప్రజలు తండా బ్రతుకునుంచి ఆధునిక పారిశ్రామిక నాగరికతకు ఊరకలు పెట్టడం, నిరక్షరాస్యతనుంచి ఉత్తమవిద్యావంతులుగా రూపొందడం నేను కళ్ళారా చూశాను. వారి ప్రాచీన సంస్కృతి కొత్త చివుళ్లు తొడిగి సర్వతోముఖంగా పెంపొందుతున్నది. వారి యువతీ యువకులు విజ్ఞానశాస్త్రంలో నిష్ణాతులౌతున్నారు. దీనికంతకు పేయి సంవత్సరాల కాలం పట్టిందా? లేదు. కొందరు శతాబ్దాల లోపునే ఈమహాభ్యుదయం సిద్ధించింది.

ప్రపంచంలో ఆరవ వంతుగా వున్న సోవియట్ యూనియన్‌లో అనేక జాతుల ప్రజలున్నారు. ఆధునిక ప్రపంచాన్ని అందుకోవాలని వాంఛిస్తున్న తూర్పుదేశాలవారికి సోవియట్ అనుభవంచాలా గొప్పగా ఉపకరించగలదని నా నమ్మకం.

ఆసియా ఆఫ్రికా ఖండాలలో నేడు చాలామంది స్వాతంత్ర్యాన్ని సాధించుకొంటున్నారు. సోవియట్ యూనియన్, నవచైనాలు సాధించిన ఘన విజయాలనుంచి ఎంతో నేర్చుకొనవలసిన దున్నదని కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఈ దేశాల నాయకులు భావిస్తం అంటున్నారు.

భారతదేశంలో వారి సమస్యల పరిష్కారానికి ఏకో ఒకరూపంలో సోషలిజమే శరణ్యం అన్న భావం బాగా పాదుకొంటున్నది.

శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాల మీద నాకు నమ్మకం వుందని మానవజాతి కంతకీ సోషలిస్టు సమాజం ఉన్నతస్థాయిని కొనివస్తుందన్న గాఢ విశ్వాసం నాకున్నదనీ అనేక సార్లు చెప్పాను.

సోషలిజం ఒక సమాజ పద్ధతి. లాభంకోసం ఉత్పత్తి సాగించేపద్ధతి కన్న అది ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా, నైతికంగాకూడా ఉత్తమమైనది. సాంఘిక పరిణామానికీ కుట్రలూ కుహకాలకు ఏమీ సంబంధంలేదని చరిత్ర చెపుతున్నది.

తండా బ్రతుకునుంచి రాజకీయానికీ, ఆక్కడనుంచి పెట్టుబడిదారీ విధానానికీ దానినుంచి సోషలిజానికీ మానవ సమాజం అభివృద్ధి గాంచింది. ఉత్తమ జీవితం కోసం మానవుడు చేసే ప్రయత్నమే ఈ అభివృద్ధిని కొనితెచ్చింది.

సోవియట్ యూనియన్‌తో కయ్యానికి తలపడాలని అపస్మారకులు మాత్రమే 'అనుకుంటారన్న నమ్మకం 1949 లో పారిస్‌లో నాకు కలిగింది. కాలక్రమాన ఆ నమ్మకం ఇంకా గాఢమైనదేకాని తగ్గలేదు. అప్పటినుంచి తమకు శాంతి కావాలని అధిక సంఖ్యాకులైన రంగు ప్రజలు స్పష్టం చేశారు. 1955 లో బాండుంగ్‌లో వారు సభ జరిపి శాంతి స్థాపనకోసం ఒక కార్యక్రమాన్ని రూపొందించారు. ఆ కార్యక్రమంపై ఐక్యతను నెలకొల్పు కొన్నారు.

ఆ చరిత్రాత్మక సభకు ప్రేక్షకుడుగా వెళ్ళాలని నేనను కొన్నాను. కాని నాకు పాస్‌పోర్టు దొరకలేదు. అందుకని సందేశయాత్రమే పంపించగలిగాను. పారిస్‌లో నేను ప్రసంగం చేసినప్పుడు చెప్పినట్లుగానే మరొక యుద్ధాన్ని నివారించ వలసిన తక్షణావశ్యకాన్ని గురించి ఆ సందేశంలో కూడా పేర్కొన్నాను. శాంతిస్థాపన విషయంలో రంగుజాతులకు గల ప్రత్యక్ష ఆసక్తిని వివరించాను.

నేను మనస్ఫూర్తిగా ఎప్పటికీ బలపరిచే సిద్ధాంతం ఇదే.

## కమ్యూనిస్టుపార్టీ బాధ్యతలు

### నూత్న నిబంధనావళిని వివరిస్తూ మహాసభలో శ్రీ అధికారి ప్రసంగం

['విశాలాంధ్ర' విలేఖరి]

రత్నసింగ్ నగర్ (అమృతసర్), ఏప్రిల్ 8

భారత కమ్యూనిస్టుపార్టీ ప్రత్యేక మహాసభలో కేంద్రకమిటీ సభ్యులు డాక్టర్ జి. అధికారి పార్టీ కొత్త నిబంధనావళిని ప్రవేశపెట్టారు. పార్టీ ముందు నేడున్న బాధ్యతలనూ, అవకాశాలనూ పార్టీ నిబంధనావళిని మార్చవలసిన అవసరాన్నీ ఆయన విపులీకరించారు.

భారత కమ్యూనిస్టుపార్టీ ప్రత్యేక మహాసభలో నిన్న కొత్త నిబంధనావళిపై చర్చ ప్రారంభమయింది. డాక్టరుజి.అధికారికొత్తనిబంధనావళిని ప్రవేశపెడుతూ ఒక కంటసీపు మాట్లాడారు. ఆయన ముఖ్యంగా నిబంధనావళి ఉద్దేశ్యాలపైనే ప్రసంగించారు.

అంతకుముందు ప్రధాన కార్యదర్శి శ్రీ అజయఘోష్ సోవియట్ నలుబదవ వార్షికోత్సవం సందర్భంలో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధుల మహాసభను గురించి ప్రసంగించారు.

#### పార్టీ నిబంధనావళిలో మార్పుల అవసరం

శ్రీఅజయ్ ప్రసంగంపూర్తిఅయిన తరువాత డాక్టరు అధికారి మాట్లాడుతూ, పార్టీ నిబంధనావళిలో చేసిన మార్పులనూ, ఆ మార్పులు చేయవలసిన అవసరాన్నీ వివరించారు.

ఆయన ప్రసంగంలో ఈ దిగువ అంశాలున్నాయి:

కాంగ్రెసు అనుసరిస్తూన్న ప్రజాస్వతంత్ర విధానాలను కమ్యూనిస్టుపార్టీ సవాలుచేయవలసినఅవసరం కానాటికి తీవ్రమవుతున్నది. వర్గశక్తుల బలాబలాల్లో మార్పు వచ్చింది. దేశంలో ఉద్యోగులూ, ఉపాధ్యాయులతో సహా అన్నివర్గాలవారూ పాగించిన అసంఖ్యాక పోరాటాల్లో ప్రజాచైతన్యం ప్రతిబింబిస్తూంది. రెండవ జనరల్ ఎన్నికల ఫలితాలూ, దేశంఅంతటా వివిధ ప్రాంతాల్లో జరిగిన ఉపఎన్నికల ఫలితాలూ - ఇవన్నీకూడా ప్రజల్లో

(మిగతా 4 వ పేజీలో)

## సోవియట్ ప్రభుత్వానికి భారత కమ్యూనిస్టుపార్టీ అభినందన: పాటవ పరీక్షలను నిలుపుచేసినందుకు

రత్నసింగ్‌నగర్, ఏప్రిల్ 9

అణ్వాయుధ పాటవ పరీక్షలను విసర్జించడానికి సోవియట్ యూనియన్ చేసిన ఏకపక్ష నిర్ణయాన్ని అభినందిస్తూ కమ్యూనిస్టుపార్టీ ప్రత్యేకమహాసభలో ఒక తీర్మానం చేశారు.

ఇంత గొప్ప చొరవ చూపినందుకు సోవియట్ ప్రభుత్వానికీ, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సోవియట్ యూనియన్ ధైర్య సాహసాలతో కొనసాగిన ఈచర్యఉద్రిక్తతానివారణలో అంతర్జాతీయ సహకార సాధనలో ఒక కొత్తశకానికి నాంది కాగలదు. తద్వారా నిరాయుధీకరణకు శాంతికి బాట వేయగలదు అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

తీర్మానాన్ని శ్రీ నంబూద్రిపాద్ ప్రతిపాదిస్తూ సోవియట్ ఉదాహరణను అనుసరించేటట్లు ప్రపంచ ప్రజలు అమెరికా మీద ఒత్తిడితెచ్చి నప్పుడే ఈ నూత్నశకం అవతరిస్తుందన్నారు.

ప్రతినిధులు ఇక్కడి నుంచి తిరిగి వెళ్లిన తరువాత ఈ విషయమై బలీయమైన ఉద్యమాన్ని నడిపించవలసిందనీ, అణ్వాయుధ పాటవ పరీక్షల విషయంలో భారత ప్రజల నుంగో భావాలను వెల్లడిస్తూ బ్రిటిష్ - అమెరికన్ రాయబార కార్యాలయాలను టెలిగ్రాముల వర్షంతో ముంచెత్తవలసిందనీ ఆయన ఉద్బోధించారు.

(వి. వి.)

### ముగోస్లావియాలో భారతరాయబారి

న్యూఢిల్లీ ఏప్రిల్ 8

ఇంతవరకు ఈజిప్టులో భారత రాయబారిగా వ్యవహరిస్తున్న అలీయవర్ జంగ్‌ని ప్రభుత్వం ఇప్పుడు యుగోస్లావ్ రాయబారిగా నియమించింది.

### భారత సహకార మహాసభకు రష్యా ప్రతినిధివర్గం

మాస్కో, ఏప్రిల్ 8

భారత సహకార సంఘాలవారి ఆహ్వానాన్ని పురస్కరించుకుని, సోవియట్ సహకార సంఘ ప్రతినిధివర్గ మొకటి నేడు సోవియట్‌నుండి భారత దేశానికి విమానంమీద బయల్దేరినట్లు సోవియట్ వార్తాసంస్థ 'టాస్' తెలిపింది.

ఈ ప్రతినిధివర్గం ఏప్రిల్ 12 నుండి 14 వరకు ఢిల్లీలో జరుగబోయే మూడవ అఖిలభారత సహకార మహాసభ కార్యకలాపాల్లో పాల్గొంటుందని టాస్‌వార్త.

ఈ ప్రతినిధి వర్గంలో ఎన్. సిడోరోవ్ (సెంట్రల్ సోవిట్‌యూనియన్ ప్రధానాధ్యక్షులు) బి. కాఖిరోవ్, తాజిక్ వినిమయదారుల సంఘాధ్యక్షులు వున్నారు.

## పుదుచ్చేరి లీనీకరణకు సంపూర్ణ సహకారం

### భారత కమ్యూనిస్టుమహాసభకు సందేశంపంపుతూ ఫ్రెంచి కమ్యూనిస్టు నాయకుడు డూక్లో హామీ

రత్నసింగ్‌నగర్, ఏప్రిల్ 9

పుదుచ్చేరి విషయంలో భారత ప్రభుత్వాలు చేసుకొన్న ఒడంబడికను ధృవపరచాలని ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటులోనూ, వెలుపలా కూడా ఆందోళన చేయగలదని ఫ్రెంచి కమ్యూనిస్టు నాయకుడు జాక్వెస్ డూక్లో భారత కమ్యూనిస్టు మహాసభకు పంపిన సందేశంలో పేర్కొన్నారు.

భారత భూభాగానికి చెందిన పుదుచ్చేరి మున్నగుప్రాంతాలు మాతృభూమిలో సంలీనంఅయే విషయంలో సామ్రాజ్యవాదులు అడ్డుకొట్టాలని చూస్తున్నారనీ ఆ చర్యలను ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకిస్తుందనీ ఆయన పేర్కొన్నారు.

ఆఫ్రికా ఆసియా ప్రజలపై సామ్రాజ్యవాదులు సాగిస్తూన్న యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ, సామ్రాజ్యవాదులు వారి మిత్రులూ చేస్తున్న అణుయుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరు సలుపుతున్న ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ భారత కమ్యూనిస్టుపార్టీతోతన సంఘభావాన్ని వ్యక్తీకరిస్తోంది. ఆగ్నేయాసియాలో సామ్రాజ్యవాదులు పన్నుతున్న పన్నాగాలను, శాంతి స్వాతంత్ర్య ప్రియులైన ప్రజలపై సామ్రాజ్యవాదులు పన్నుతున్న కుట్రలను వమ్ముచేయడానికి భారత కమ్యూనిస్టుపార్టీ వీరోచిత చర్యలు తోడ్పడుగాక! అని జాక్వెస్ డూక్లో తమ సందేశంలో పేర్కొన్నారు.

పంజాబ్ శాసనసభ బడ్జెట్ సమావేశం సమాప్తమైంది.

### ఇండోనేషియాపై అమెరికా కినుక

#### సోషలిస్టు దేశాలనుంచి ఆయుధాలు ఖరీదు చేస్తున్నందుకు

వాషింగ్టన్, ఏప్రిల్ 7

సోషలిస్టు దేశాలనుంచి ఇండోనేషియా ప్రభుత్వం ఆయుధాలు ఖరీదుచేయ బూనటం శోచనీయమని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి నేడు పత్రికా విలేఖరులసమావేశంలో చెప్పారు.

పశ్చిమ దేశాలనుంచి, సోషలిస్టు దేశాలనుంచికూడా ఆయుధాలు ఖరీదు చేయటానికి ఇండోనేషియా ప్రయత్నించిన సంగతి తమకు తెలుసునని ఆయన అన్నారు. సోషలిస్టు దేశాలనుంచి ఖరీదు చేసే ఆయుధాలను ఇండోనేషియా తిరుగుబాటుదారులపై జకార్తా ప్రభుత్వం ప్రయోగించే అవకాశం వుందనీ, ఇది చాలా దారుణమైనసంగతినీ ఆయనచెప్పారు.

ఫార్మోజానుంచి అమెరికా ఆయుధాలు తిరుగుబాటు దారులకు సరఫరా అవుతున్నాయన్న సంగతి పాఠకులకు విదితమే.

ఇండోనేషియా ప్రభుత్వానికి ఆయుధాలు అమ్మవద్దని దక్షిణ సుమత్రాలోని తిరుగుబాటుదార్ల ప్రభుత్వం పశ్చిమ రాజ్యాలకు నేడు విజ్ఞప్తి చేసింది.

### మున్సిపల్ చైర్మన్‌గా కమ్యూనిస్టు ఎన్నిక

రాజకోట, ఏప్రిల్ 8

ఉన్లేట మునిసిపాలిటీ చైర్మన్‌గా కమ్యూనిస్టు నాయకుడు శ్రీ చిరుభాయ్ మెహతా ఎన్నికై బడ్డారు. సౌరాష్ట్రంలో మునిసిపల్ చైర్మన్‌గా కమ్యూనిస్టు ఎన్నికోబడటం ఇదే మొదటిసారి.

### భారతదేశంలో అణుశక్తి

బొంబాయి, ఏప్రిల్ 8

సాంకేతిక అభివృద్ధి పొందిన దేశాలతో సమానస్థాయికి చేరుకోవాలంటే భారతదేశంకూడా విరివిగా అణుశక్తిని ఉపయోగించవలసి వుంటుందని అణుశక్తిశాఖ కార్యదర్శి డాక్టరు భాభా ఇక్కడ రోటరీ క్లబ్బులో ప్రసంగిస్తూ చెప్పారు.

అణుశక్తి ఇప్పుడు సాంకేతిక శాస్త్రంలో ఒక కొత్త శాఖగా రూపొందిందన్నారు. ఈ 20 వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం అణుశక్తిపై ఆధారపడి వుందని శ్రీ భాభా చెప్పారు. అందుకని సాంప్రదాయక ఇంధనానికి బదులు అణుశక్తివాడకాన్ని పెంపొందించవలసిన అవసరం చాలా వుందన్నారు.

సోషలిస్టు దేశాలనుంచి మన దేశానికి దిగుమతులు ఎక్కువగానూ, ఎగుమతులు తక్కువగానూ వున్నాయి.

## ప్రకటన

చేనేత వస్త్రముల అమ్మకముపై రిబేటు రూపాయి 1 కి ఆరు నయాపైసలు చొప్పున మరల తెలియవరచువరకు ఆంధ్రదేశ చేనేత సహకార సంఘము యొక్క ఎంపోరియములు, డిపోల మేనేజర్లు, అన్ని ప్రాథమిక చేనేత సహకార సంఘములు యివ్వవచ్చును.

ఆంధ్రదేశ చేనేత సహకార సంఘము
విజయవాడ - 2

విళంబి నామ సంవత్సర
చాంద్రమాన చైత్ర బహుళ
సప్తమి రా 9-42
మూల ఉ 7-45

విశాలాంధ్ర

గురువారం 10-4-58
చైత్ర-20-1880

## ముఠా తగాదాలకు మూల కారణం?

కాంగ్రెసుపార్టీలో నానాటికీ పెరుగుతున్న ముఠా కక్షలను, శిక్షణా రాహిత్యాన్ని గురించి కాంగ్రెసు నర్కింగ్ కమిటీ, పార్లమెంటరీ బోర్డులు చర్చించి, కొన్ని తీర్మానాలు చేశాయి. రాజ్యసభ ఎన్నికల సందర్భంలో కాంగ్రెసు అభ్యర్థులు కొందరు ఓడిపోవడంవల్ల, కాంగ్రెసు మంత్రివర్గాలపై అవిశ్వాసం తెలిపే పత్రాలపై కాంగ్రెసు శాసనసభ్యులే సంతకాలు సేకరించడంవల్ల కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఆత్మ పరిశీలనకు పూనుకోవలసి వచ్చింది.

"కాంగ్రెసుపార్టీ నాయకుల పట్ల అవిశ్వాసం ప్రకటించే పత్రంపై సంతకాలు చేయడం గాని, అలాంటి సంతకాల సేకరణ వుద్యమంలో పాల్గొనడం గాని, ప్రోత్సహించడంగాని కూడనివి", ఈ సూత్రాన్ని భంగపరచినవారిపై శిక్షణ చర్యలు తీసుకుంటామనీ అగ్రనాయకత్వం తీర్మానించింది. కాంగ్రెసు శాసనసభా నాయకులు తరచుగా శాసనసభ్యుల సమావేశాలను జరిపి, సభ్యుల అభిప్రాయాలను తెలిసికోవాలని ఆదేశించింది. పార్టీ సమావేశాలలో సంతృప్తిపడనివారు కేంద్ర పార్లమెంటరీ బోర్డుకు నివేదించుకోవాలేగాని శిక్షణా రాహిత్య చర్యలకు దిగరాదని హెచ్చరించింది.

కాంగ్రెసు అగ్రనాయకులు శిక్షణారాహిత్యానికి మూల కారణమేమిటో లోతుగా తరచిచినట్లు కన్పించదు. కాంగ్రెసుఅధ్యక్షులు శ్రీ ఢేబర్ తమ పార్టీ పత్రికయైన 'ఎకనమిక్ రివ్యూ' ఏప్రిల్ 1వ తేదీ సంచికలో ఇంపాకీయంవ్రాస్తూ, తమ పార్టీ జాతీయసంస్థగా పనిచేయడం లేదనీ. కేవలం నూటికి నూరుపాళ్ళు పార్లమెంటరీ పార్టీగా క్రమేణా మారిపోతోందనీ అన్నారు. ఎన్నికల సమయాల్లో మాత్రం కాంగ్రెసు నాయకులు ప్రజల నద్దకు వెడుతూ, కేవలం పదవీ కాంక్షాపరులుగా తయారవుతున్నారని విచారం వ్యక్తపరిచారు.

"పార్టీ నిర్మాణం నానాటికీ బలహీనపడుతూంది; ఒక్కొక్కపుడు విచ్ఛిన్నమైపోతున్నదనే భావంకూడ కలుగుతోంది" అన్నారు కాంగ్రెసు అధ్యక్షులు.

కాని కాంగ్రెసు సంస్థ క్రమంగా జాతీయ వ్యవస్థనుండి కేవలం పార్లమెంటరీపార్టీగా రూపొందడానికి మూలకారణా లేమిటో శ్రీ ఢేబర్ నిర్వచించలేకపోయారు. కేవలం బాహ్యాచిహ్నాలను గమనించినంత మాత్రాన ఎవరూతమ లోట్లను సరిదిద్దుకోలేరు. ముఠా తగాదాలకు, శిక్షణారాహిత్యానికి అసలు కారణాలేమిటో పరిశీలించి, వాటిని తొలగించాలి.

కాంగ్రెసుపార్టీ గత పదేళ్ళుగా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూఖూడ ప్రభుత్వాధికారాన్ని చెలాయించుతూంది. ప్రతిసారి ఎన్నికల సమయాల్లో ప్రజల కెన్నో వాగ్దానాలు చేస్తోంది. చేతి వృత్తుల రక్షణ నుంచి పరిశ్రమాభివృద్ధి, భూసంస్కరణలు, సంక్షేమరాజ్యం సోషలిస్టు తరహా సమాజ నిర్మాణంవరకు ఎన్నికల ప్రణాళికల్లో కన్పించుతాయి. కాని ఈవాగ్దానాలను తమమంత్రులు అమలుజరుపుతున్నారా లేదా అనే విషయాన్ని ఎన్నడూ తనిఖీచేయడంలేదు. ప్రజల కిచ్చిన వాగ్దానాలను భగ్నం చేసిన కాంగ్రెసు మంత్రులపై శిక్షణ చర్య తీసికున్న వుదాహరణ, గత పదేళ్ళలో నూ ఒక్కటికూడా లేదు.

అందుచేత జనసామాన్యం జీవితంలో చెప్పదగిన అభివృద్ధి లేకపోగా, అధికార పదవులను అధిష్ఠించిన మంత్రులు, వారిని ఆశ్రయించినవారు విపరీతంగా ఆస్తిపాస్తులు గడించిన వుదాహరణ లెన్నో వున్నాయి. అలాగే బ్రిటిషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన రోజుల్లో స్వాతంత్ర్యోద్యమంలో ఎన్నడూ పాల్గొనని జమీందారులు, దేశముఖులు, బడాపెట్టుబడిదారులు నేడుకాంగ్రెసు బురఖా వేసికున్నారు. తద్వారా తమ స్వార్థప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు. రెండోవైపున స్వాతంత్ర్యోద్యమంలోపాల్గొన్న వారిలో అనేకమంది నేటికీజీవనోపాధిలేకుండా బాధపడుతున్నారు. కాంగ్రెసు పార్టీలో తగాదాలకు, మూల కారణమిదే!

అధికార పదవుల్లో వున్నవారు, వారిని ఆశ్రయించిన వారు తమ జేబులు నింపుకుంటూంటే, అవి అందుబాటులో లేనివారు తదవకాశం కోసం ఎదురు చూడడం సహజమేగదా! మంత్రివర్గంలో వున్న ముఠాను ఆశ్రయించిన కొందరు భూస్వాములు, పెట్టుబడిదారులు లాభం పొందుతూంటే, మరో ముఠాను గద్దెఎక్కిస్తే తాము లాభం పొందవచ్చుననే దురాకాంక్షతో ప్రత్యర్థులైన మరి కొంతమంది భూస్వాములు పెట్టుబడిదారులు మంత్రివర్గాన్ని కూలదోయడానికి ప్రయత్నించుతున్నారు. కాంగ్రెసులోని ముఠా తగాదాలకు, శిక్షణా రాహిత్యానికి కీలకమిదే!

ఈ తగాదాలకు "స్వార్థపరత్వం, దురాపేక్ష" మూల కారణమని కేంద్ర పార్లమెంటరీబోర్డు సభ్యులంతా ఏకగ్రీవంగా అభిప్రాయపడినట్లు 'హిందూ' పత్రిక రాజకీయ విలేఖరి తెల్పుతున్నాడు. ఏతే జీవితంలో ఆశాభంగం పొంది నిస్పృహ చెందిన పాత కాంగ్రెసువాదులే, తిరుగుబాటుకు, శిక్షణారాహిత్యానికి ప్రధాన కారకులనీ, కొత్తగా చేరిన ధనాఢ్యులు తెరవెనుక నుండి నాటక మాడిస్తుండవచ్చునేమో గాని ముఖ్య పాత్రధారులు మాత్రం కారనీ, అగ్ర నాయకత్వం అభిప్రాయపడుతున్నట్లు ఆవిలేఖరి తెలియజేశాడు.

ఈ వార్త నిజమైతే కాంగ్రెసు అగ్రనాయకత్వం తమ పక్షంలో కొత్తగా చేరిన ధనిక వర్గాల దురాపేక్షను, గ్రూపుతగాదాల్లో వారి కీలక పాత్రను గమనించినట్లు కన్పించదు. ధనాఢ్యులలో ఒకముఠా అధికారంలో వున్నవారిని లోబరచుకొని స్వార్థప్రయోజనాలను సాధించుకుంటుండగా, వారిని కూలదోసి మరొకరిని ఎక్కించి తాము లాభంపొందాలని రెండో ముఠా తాపత్రయపడుతోంది. పాత కాంగ్రెసువాదులు రెండు ముఠాలలోను వుండొచ్చు. వారిలో కొందరు పూర్తి స్వార్థపరులుగా మారి వుండవచ్చు; మరి కొందరు పై ముఠాల చేతుల్లో కీలుబొమ్మలుగా మాత్రమే వ్యవహరించుతుండవచ్చు. అంతేగాని పాత కాంగ్రెసువాదులే కాంగ్రెసులోని తగాదాలకు మూలమనడంమాత్రం వాస్తవం కాదు. కొత్తగా కాంగ్రెసు పార్టీలో చేరిన ధనికుల, భూస్వాముల స్వార్థం, దురాపేక్ష ఇందుకు ప్రధాన కారణమనడంలో సందేహంలేదు.

అందుచేత ప్రజల కిచ్చిన వాగ్దానాలను, ద్వితీయ ప్రణాళికా లక్ష్యాలను అమలుజరిపేందుకు అనవసరమైన నిర్మాణ చర్యలు తీసికున్నపుడే కాంగ్రెసు అగ్రనాయకులు తమ పార్టీలో ముఠా తగాదాలను అరికట్టగలుగుతారు. భూసంస్కరణలు నగైరా కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారికి కాంగ్రెసు మంత్రివర్గంలోగానీ, పార్టీ లోగానీ తావుండరాదు.

అధికార పదవులను వ్యక్తుల స్వార్థానికి వినియోగించుకునే అవకాశమున్నంతకాలం పాలక వర్గ పార్టీలో ముఠా తగవులు నన్తూనే వుంటాయి. అందుచేత కాంగ్రెసు మంత్రుల, ఉన్నతాధికారులఆస్తిపాస్తులపైన ఎప్పటికపుడు తనిఖీ వుండాలి. స్వంత ఆస్తులు సంపాదించుకోడానికి పదవులను దుర్వినియోగంచేసిన వారిపై శిక్షణ చర్యలు తీసికోవాలి. అపుడే కాంగ్రెసు పార్టీలో శిక్షణను, నైతికవిలువలను పునరుద్ధరించేందుకు ఆస్కార మేర్పడుతుంది.

అలాగే కాంగ్రెసు అగ్రనాయకులు తామొక్కరమే జాతికంతటికీ ప్రతినిధులమనే అహంభావం విడనాడాలి. ద్వితీయ ప్రణాళిక లక్ష్యాలను జయప్రదం చేసేందుకు, సోషలిస్టు భావాలు గలవారందరి సహకారాన్ని సంపాదించాలి.

## గదర్ పార్టీవీరుడు సంతోష్ సింగ్

### పంజాబులో మొట్టమొదట ఎర్రజెండాఎగుర వేసినవ్యక్తి

అమృతసర్, ఏప్రిల్ 6

పంజాబులో మొట్టమొదటిసారిగా 1925 లో ఎర్రజెండాను ఎగుర వేసిందిభాయి సంతోష్‌సింగ్. ఆయన గదర్ పార్టీకి చెందినవారు.

ఈ విషయాన్ని ఇక్కడ భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభ ప్రారంభ సందర్భంలో అరుణపతాకాన్ని ప్రతిష్ఠాపన చేస్తూ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీ సుందరయ్యగారు తెలిపారు.

ఆయన ప్రతిష్ఠాపన చేసిన ఈ పతాకం గౌరవ ప్రతిష్ఠలను కాపాడి ముందుకు తీసుకొని పోవలసిన బాధ్యత మనపై వున్నదని శ్రీ సుందరయ్యగారన్నారు.

(అరుణ పతాకోత్సవానికి సంబంధించిన వార్తను ఇంతకు ముందే క్లుప్తంగా యిచ్చాం-సం)

ఎర్ర జెండాను ఎగురవేస్తూ శ్రీ సుందరయ్యగారు జలియన్‌వాలాబాగ్ వీరుల త్యాగాలను ఉద్గడించారు. దేశ స్వాతంత్ర్యంకోసం తమప్రాణాలను బలియిచ్చిన వీరులకు కమ్యూనిస్టు పార్టీ తరఫున జోహార్లు సమర్పించారు.

భారతదేశంలో సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించేందుకు కమ్యూనిస్టుపార్టీ సభ్యులు జలియన్‌వాలాబాగ్ వీరుల ఉత్తేజం పొందాలని శ్రీ సుందరయ్యగారు ఉద్బోధించారు.

## 'బాధామయ ప్రపంచానికి మారణాస్త్రాలకన్నా, శాంతి భద్రతలవసరం'

### కొలంబియా విశ్వవిద్యాలయంలో శ్రీ రాధాకృష్ణ ఉద్బోధ

న్యూయార్క్, ఏప్రిల్ 8

మారణాయుధాల బలంతోకాక పరస్పర అవగాహన, న్యాయం ప్రాతిపదికగా నేటి బాధానుయ ప్రపంచానికి శాంతి, భద్రతల్ని సమకూర్చి పెట్టవల్సిందిగా నేడు కొలంబియా యూనివర్సిటీలో యేర్పాటు చేయబడ్డ మహాసభలో ఉపన్యసిస్తూ ప్రఖ్యాత తత్త్వవేత్త, భారత ఉపాధ్యక్షులు శ్రీ రాధాకృష్ణ అమెరికా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సోవియట్ యూనియన్‌లో శాస్త్రవేత్తలకు, కళాకారులకు, మేధావులకు స్వేచ్ఛవుందని, వీరంతా భవిష్యత్తులో తదితర రంగాలలో కూడా స్వేచ్ఛని పొందుతారని తన నమ్మకమని శ్రీ రాధాకృష్ణ అమెరికన్లతో చెప్పారు.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితిని సమీక్షిస్తూ అంతర్జాతీయంగా పరస్పర అవగాహన, శాంతి అవసరం అనికూడా శ్రీ రాధాకృష్ణ అన్నారు.

శ్రీ రాధాకృష్ణ తమ ఉపన్యాసంలో యింకా యిలా అన్నారు:

మీరు అమెరికన్లు ప్రపంచంలో ప్రముఖస్థానాన్ని స్థానాన్ని పొందారు. ద్వితీయప్రపంచయుద్ధానంతరం యూరప్ ఆర్థికవ్యవస్థ పుంజుకోవడానికి మీరెంతో సహాయంచేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మాపట్ల మీరు సానుభూతి, నైతిక సహాయాన్నందించారు. ప్రస్తుతం మా ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమానికి, పారిశ్రామికాభివృద్ధికి నైతికంగాను, భౌతికంగానుకూడా సహాయం చేస్తున్నారు.

### 'బాధామయ ప్రపంచానికి శాంతి భద్రతలు కావాలి'

"గతంలో మీరు సైనిక ఘనకార్యాలు చేశారు. అయితే, మారణాయుధాల బలంతోకాక, పరస్పర అవగాహన, న్యాయం ప్రాతిపదికగా నేటి బాధామయప్రపంచానికి శాంతి, భద్రతల్ని సమకూర్చి పెట్టడంలో మీ నుంచి ఆశించినంత జరగలేదు."

### పశ్చిమదేశాలు సోవియట్‌ని అర్థం చేసుకోవాలి

సోవియట్ యూనియన్‌ని అర్థం చేసుకోడానికి పశ్చిమ దేశాలు సరియైన ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేస్తూ శ్రీ రాధాకృష్ణ యింకా ఇలా అన్నారు:

"మన వ్యతిరేకిని మనం మార్చలేకుంటే, మన మెప్పుడూ అతని తప్పులను గూర్చి, లోసుగుల్ని గూర్చే మాట్లాడగూడదు. మీరు మిక్కిలి అతని గొప్పతనాన్ని గూర్చి అతనికి తెలియపర్చాలి."

ఏవో రాజకీయ పన్నాగాలు, కుట్రలకి సంబంధించిన చిట్కాల నుపయోగించి లక్షలాది ప్రజలకి సంబంధించిన వ్యవస్థల్ని గూర్చి వివరించి చెప్పలేమని, అంచేతనే విభిన్నభావాలతో వుండే మన వ్యతిరేకుల్ని సహితం మానవ మేధస్సు నుపయోగించి మానవ హృదయంతో చూడాలని శ్రీ రాధాకృష్ణ అన్నారు.

సోవియట్ యూనియన్‌లో మేధావులకు స్వేచ్ఛ లేదని మనం ఖచ్చితంగా అనగలమా? అని ప్రశ్నించి శాస్త్ర విజ్ఞానానికి స్వేచ్ఛే లేకపోతే, మరి సోవియట్ యూనియన్ విజ్ఞానశాస్త్ర రంగంలో అంతటి అద్భుత కృత్యాల నెలా సాధించింది అని కూడా శ్రీ రాధాకృష్ణ అన్నారు.

సోవియట్‌లో శాస్త్రవేత్తలకు, కళాకారులకు, మేధావులకు, స్వేచ్ఛ వుందని, ఏవోకొన్ని రంగాలతోనే 'స్వేచ్ఛ' పరిమితంగాదు కనుక వీరందరు భవిష్యత్‌లో తదితరతరంగాల్లో కూడా స్వేచ్ఛనే కోరుకుంటారని శ్రీ రాధాకృష్ణ చెప్పారు.

విద్యావంతులు, స్వేచ్ఛగా ఆలోచించగల శక్తిగల్గిన సోవియట్ ప్రజలు కొరకొక్కల్ని, పార్లమెంటరీ ప్రతిపక్షాన్ని, ప్రజాభిప్రాయంద్వారా బురాక్రసీని అదుపాజ్ఞల్లో వుంచడాన్ని కోరుకుంటారని, ఏ ప్రభుత్వమూ కూడా ప్రజల కోర్కెల్ని కాలరాసి, ప్రజల కలల్ని కల్లల్ని చేయలేదని శ్రీ రాధాకృష్ణ అన్నారు.

ప్రపంచం ఒక అంతర్జాతీయ వ్యవస్థగా మానవ కుటుంబంవైపు పురోగమిస్తోందని, యిందుకు శాంతి అవసరమని, శాంతిని సాధించాలంటే అన్ని దేశాలు ఏకకంఠంతో న్యాయం, స్వేచ్ఛ, నిష్కల్మషత్వం అనే సూత్రాల్ని అంగీకరించాలని శ్రీ రాధాకృష్ణ ఉద్బోధించారు.

## కత్తిరింపులు

## కేరళ ప్రయోగంపై "సాక్షి" వ్యాఖ్యానం

మొన్న శనివారంనాడు గమనార్హమైన వార్షికోత్సవం జరిగింది. కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిసంవత్సరకాలం పూర్తయింది. ఆ ప్రభుత్వం తాను సాధించిన కొద్దిపాటి విజయాల పట్టికను ఆవేళ ప్రకటించింది. ముమ్మార్తులా త్రిమూర్తులన దగిన రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, ప్రధాని నెహ్రూ, జయప్రకాశ్ నారాయణలాంటి వారి ప్రశంసలను ఆ ప్రభుత్వం పొందగల్గింది.

కాంగ్రెసు అగ్రనాయకులు కేరళ ప్రభుత్వంపట్ల చిత్తశుద్ధి, నిజాయితీలతో కూడిన సహనభావం ప్రదర్శిస్తున్నారు; కాని దురదృష్టవశాత్తు అగ్రనాయకుల ఆదర్శాన్ని మిగతా కాంగ్రెసు పెద్దలు, ఘోటానాయకులు పాటించటం లేదు.

కేరళ ప్రభుత్వం చేసిన శాసనాలలో చాలాభాగం పూర్తిగా అభ్యుదయకరమైనవి. అందుచేత కడుపు మండిన స్వార్థపర వర్గాలవారు ఆ ప్రభుత్వంపై తిరగబడటం సహజం.

ఈ వర్గాలవారికి డబ్బు కొరత అంటూ ఎన్నడూ వుండదు కనుక, ప్రచారయుద్ధాన్ని పెద్ద ఎత్తున కొనసాగించుల్గుతున్నారు. కేరళలో శాంతిభద్రతలు మృగ్యమైపోయాయని తాము చెప్పే మాటలు మనందరి చేత నమ్మింపజూస్తున్నారు. పశ్చిమ బెంగాల్, బీహారులలో బయటపడిన రహస్యాలు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో చెచ్చరిల్లిన దోపిడీ గాండ్ర ప్రమాదం, మిగతారాష్ట్రాలలోని పోలీసులు ఊపిరాడనంతగా తమ పనులలో మునిగి తేలుతుండటం మన చూస్తూన్నాం.

విద్యాబిల్లుపై పోరాటం ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రాంగణానికి ప్రాకింది. రాష్ట్రప్రభుత్వ అధికారాలకు విఘాతం సంభవించినా ఎవరికీ పట్టినట్టు లేదు. మత బోధన ద్వారా మనస్సులను కలుషితం చేయటంతో పోల్చితే రాజకీయ బోధనద్వారా మనస్సులను మార్చటం ఏపాటి అని సామాన్యునిసందేహం. కనుక క్రైస్తవ మతాధిపతుల కాకిగోలకు విలువ నివ్వనేల?

ఒక్కమాటలో చెప్పాలంటే, కేరళలో జరుగుతున్న ప్రయోగం అపూర్వమైనది. తగినంత అవకాశమిచ్చి, ఆ ప్రయోగ పర్యవసానమేమిటో పరిశీలించటం అందరి కర్తవ్యం.

('ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వ్యాఖ్యాత "సాక్షి" వ్యాఖ్యానం - ఏప్రిల్ - 8)

## ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీ బిల్లు

### గెజిట్‌లో ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 9

ప్రభుత్వం ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీ చట్టాలను సవరించడానికి రెండు బిల్లులను నేడు ప్రజాభిప్రాయ సేకరణ కోసం గెజిట్‌లో ప్రకటించింది.

ఉస్మానియా యూనివర్సిటీకి వైస్‌ఛాన్సలర్ నియామకం, సెనేటు, అకాడమిక్ కౌన్సిళ్ళ నియామకం విషయంలోచేసిన మార్పులనే మిగతా రెండు యూనివర్సిటీలలోనూ ప్రవేశపెట్టడం ఈ బిల్లుల ఆశయం.

బిల్లు చట్టరూపం పొందినతర్వాత కూడా ప్రస్తుతం ఉభయ యూనివర్సిటీలలో వున్న అధికారులు వారి పదవీ పరిమితి ముగిసేవరకూ అలాగనే ఉంటారు.

ఇతర యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్లు, సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరు, యూనివర్సిటీ కళాశాలల్లో ఆయా శాఖల ప్రధానాధ్యాపకులు, ఎక్స్ అఫీషియో సెనేటు సభ్యులుగా వుంటారు.

అయిదుగురు శాసనసభ్యులు, ప్రతి జిల్లాకు ఒకరుచొప్పున పంచాయితీ ప్రెసిడెంట్లు - మున్సిపల్ కౌన్సిలర్లు ప్రతినిధులు సెనేటులో వుంటారు. గవర్నరు నిమ్నశాఖలు వగైరాలనుంచి 80 మందిని నామినేట్ చేస్తారు.

ఆంధ్రసాహిత్య, సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు కూడా ఎక్స్ అఫీషియో సభ్యులుగా వుంటారు.

ఈ బిల్లులపై ఏవైనా అభ్యంతరాలుంటే మే 7వ తేదీలోగా తెలియపరచాలి. (వి. వి.)

శ్రీ రాధాకృష్ణ ఉద్బోధించారు.

## బడుగు దేశాలకు సహాయం

బడుగు దేశాలకు సహాయం విషయమై ప్రస్తావిస్తూ శ్రీ రాధాకృష్ణ యింకా యిలా అన్నారు:

"అంతర్జాతీయరంగంలో పెద్దగా అభివృద్ధిచెందిన దేశం బాగా అభివృద్ధి చెందని దేశానికి సహాయం చేయాలి. బడుగు దేశాలు తమ కాళ్ళమీద తాము నిలబడే విధంగా వాటికి ఆర్థికసహాయాన్ని అందించాలి."

ఆసియా, ఆఫ్రికా దేశాల్లో లక్షలాది ప్రజలు తమ భౌతిక పరిస్థితుల్ని బాగుపర్చుకోవాలని కోరుతున్నారని, అంతవరకూ వారికి స్వేచ్ఛ విలువలంటే ఏమిటో తెలియదని, ప్రపంచానికి ఆర్థికాభివృద్ధి పథక మొకటి కావాలని, అందుకు అభివృద్ధి చెందిన దేశాలు కొంత సహాయం చేయాలని; సుహృద్భావం, చిత్తశుద్ధి, ఆలోచన ప్రాతిపదికగా అగ్రరాజ్యాల నాయకులు పరస్పరం సంప్రతింపులు జరుపుకుని ఒడంబడికలకు రావాలని శ్రీ రాధాకృష్ణ తమ ఉపన్యాసంలో చెప్పారు.

## అణుధూళివల్ల రాచపుండు

### అమెరికన్ శాస్త్రజ్ఞుని వివరణ

న్యూయార్క్, ఏప్రిల్ 8

అణ్వాయుధ పరీక్షలవల్ల ఉత్పన్నమయ్యే అణుధార్మికశక్తికి సంబంధించిన విషయాలపై ఇటీవల అమెరికా అణుశక్తి సంఘంవారు వెలువరించిన నివేదిక అణుధూళి ప్రమాదాన్ని గూర్చి చాలా తక్కువ అంచనా వేస్తున్నట్లు ప్రఖ్యాత అమెరికన్ శాస్త్రజ్ఞుడు డా॥ సెలోవ్ నేడు "న్యూయార్క్ టైమ్స్"కి వ్రాసిన లేఖలో పేర్కొన్నారు.

అణ్వాయుధ పరీక్షల వల్ల ఉత్పన్నమయ్యే అణుధార్మికశక్తికి సంబంధించిన "స్ట్రాంటియం - 90" అనే పదార్థం మానవశరీరంలోకి చొరబడినా 'ప్రమాదం'లేదనే ధోరణిని డాక్టరు సెలోవ్ ఆ లేఖలో ఖండించాడు.

"స్ట్రాంటియం - 90" ఎంత తక్కువ మోతాదులో శరీరంలోకి ప్రవేశించినా, ఆమోతాదుకు సరిపడా, అది "లూకేమియా" (ఎముకలకుసంబంధించినరాచపుండు) వ్యాధికి దారి తీస్తుందని కూడా సెలోవ్ వ్రాశాడు.

## సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి

హైదరాబాద్, ఏప్రిల్ 8

సింగరేణి బొగ్గుగనుల్లో మొన్న మార్చినెలలో 1,61,114 టన్నుల బొగ్గు ఉత్పత్తి అయింది. ఇది నిరుటి మార్చికన్నా 7,645 టన్నులు అధికం.

## ప్రాజెక్టుల నిర్వహణలో సవచైనా ఆదర్శం

### మన ఇంజనీర్లు నేర్చుకోవాలనిఇరిగేషన్ మంత్రి శ్రీ నరసింగరావుగారి ఉద్బోధ

('విశాలాంధ్ర' విలేఖరి)

హైదరాబాద్, ఏప్రిల్ 9

సమన్వయం కొరవడ్డంవల్ల ప్రాజెక్టుల నిర్వహణ మందకొడిగా సాగుతున్నదనీ, క్వాంటుంగ్‌లాంటి బ్రహ్మాండమైన ప్రాజెక్టులను కొద్దికాలంలోనే నిర్మించిన చైనాను చూసి మన ఇంజనీర్లు చాలా నేర్చుకోవాలనీ నీటి పారుదలశాఖా మంత్రి శ్రీ జె. వి. నరసింగరావుగారు ఇంజనీర్లకు హితవు చెప్పారు.

మొన్న నిజామాబాదులో పి. డబ్ల్యు. డి. ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ల సభను ఆయన ప్రారంభించారు. చీఫ్ ఇంజనీరు శ్రీ ఎల్. వెంకటకృష్ణయ్యర్‌కూడా ఈ సభలో పాల్గొన్నారు.

శ్రీ నరసింగరావుగారు ఆసభలో ప్రసంగిస్తూ ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రణాళికలో చేర్చినది మొదలు, వాటి పరిశీలన, నిర్వహణ, నిర్వహణలో ఉపయోగించే పరికరాలు, ఇంజనీర్ల సామర్థ్యం, శాసనసభలో సభ్యుల విమర్శ మున్నగు విషయాలన్నింటినీ ప్రస్తావించారు. ఇంజనీర్ల దృక్పథం చాలా ఛాందసంగావుందనీ దుబారా ఎక్కువవుతున్నదనీ తనకని పిస్తోందన్నారు. అందుకని ఇంజనీర్లు పనికి ప్రాధాన్య మివ్వాలేకాని పని పద్ధతులకు కాదని ఆయన చెప్పారు.

ఇతర దేశాలలో నిర్మాణ కార్యక్రమాలకు ఇతర పనులకన్న ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వారు ఆచారానికి భిన్నమైన పద్ధతులను అవలంబించడంవల్ల సత్ఫలితాలు సమకూరుతున్నట్లు రుజువైంది. చైనావారు అతి స్వల్ప కాలంలో బ్రహ్మాండమైన ప్రాజెక్టులను నిర్మించారు. ఉదాహరణకు క్వాంటుంగ్ ప్రాజెక్టు నేతీసుకోండి. ఇంత స్వల్పకాలంలో ఇంతపెద్ద ప్రాజెక్టును మరెవరూ ఎక్కడా నిర్మించలేదు. 196 మైళ్ళ పొడవున్న కియాంగ్సు ఉత్తరపు కాల్వను 80 రోజులలో పూర్తిచేశారు. మొత్తంపనంతామానవ బలగంతోనే పూర్తిచేశారు. 13 లక్షల మంది ప్రజలు 247 కోట్ల ఘనపుటడుగుల మన్ను తవ్వారు.

చైనావారు సంఘ ప్రాజెక్టును 75 రోజులలోపూర్తి చేశారు. దీనిలో 42 లక్షల ఘనపుటడుగుల కాంక్రీటు పనికూడా వుంది అని శ్రీ నరసింగరావుగారు తెల్పారు. అందుకని మన ఇంజనీర్లు ఛాందసమైన పాత పద్ధతులకే అంటిపెట్టుకొని కూర్చుంటే లాభం లేదనీ చైనాలాంటి దేశాలను చూసి పనిపూర్తికావడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకోవాలనీ ఆయన ఉద్ఘాటించారు.

## శ్రీ పి. వి. జి. రాజుపై ఒరిస్సా సోషలిస్టు నాయకుని విమర్శ

హైదరాబాద్, ఏప్రిల్ 9

ఆంధ్ర సోషలిస్టుపార్టీ వ్యవహారాల పరిశీలనకు నియమితులైన ఒరిస్సా సోషలిస్టుపార్టీ అధ్యక్షుడు శ్రీ రవిరాయ్ నేడు పి. వి. జి. రాజుగారిని తీవ్రంగా విమర్శిస్తూ ఒక ప్రకటన చేశారు.

సోషలిస్టుపార్టీ సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధమైన వైఖరిని రాజుగారు అవలంబించారనీ, ఆయన పూర్వం అన్న మాటలకు ఇప్పుడంటున్న మాటలకు పొంతులేదనీ విమర్శించారు.

ప్రజాసోషలిస్టు,సోషలిస్టు పార్టీల విలీనం కావాలని కోరడం సోషలిస్టు పార్టీ సిద్ధాంతాలకే విరుద్ధం. రాజుగారు ఈ విరుద్ధసిద్ధాంతాన్ని ప్రచారం చేయడమేకాక పార్టీ ప్రారంభించిన శాసనోల్లంఘన నోర్యమానికి కూడా తూట్లు పొడుస్తున్నారు.

అదేకాకఆయనా,ఆయనఅనుచరులూ పచ్చిఅబద్ధాలు ప్రచారంచేస్తున్నారు. ఈ విషయాన్ని సోషలిస్టు లంతా గుర్తుంచుకోవాలి. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి వుండలేనివారికి పార్టీలో తావులేదు అని శ్రీ రవిరాయ్ తమ ప్రకటనలో పేర్కొన్నారు. (వి. వి.)

సత్యాగ్రహం సందర్భంలో అరెస్టు అయిన సత్యాగ్రహులందరినీ విడుదలచేయడానికి పంజాబు ప్రభుత్వం ఉత్తర్వుచేసింది.

## శ్రామికవర్గ శత్రువులకు కృశ్చేవ్ హెచ్చరిక

తాతాబనా(మధ్యహంగరీ), ఏప్రిల్ 8

శ్రామికవర్గ శత్రువులైనవారు ఏ సోషలిస్టుదేశంలో నైనాసరే రెచ్చగొట్టేచర్యల్ని గాని, విప్లవప్రతీఘాతక చర్యల్ని గాని ప్రోత్సహించే ప్రయత్నిస్తే వారికి తగిన సమాధానం యివ్వబడ్తుందని సోవియట్ ప్రధాని కృశ్చేవ్ నేడిక్కడ హెచ్చరించారు.

బుడాపెస్టుకి 37 మైళ్ళ పశ్చిమంగావున్న తాతాబనా వద్ద 40 వేల మంది గని కార్మికులు, తదితర కార్మికుల సమక్షంలో ఉపన్యసిస్తూ కృశ్చేవ్ వైఖరిగా అన్నారు.

ఇంకా యిలా అన్నారు:

"హంగరీలో తిరిగి విప్లవ ప్రతీఘాతక చర్యలెత్తనిక్కి తలెత్తవని నేను ఖచ్చితంగా చెపుతున్నాను."

మరోసారి సరికొత్తగా కవ్వింపు చర్యలకు దిగవద్దని శ్రామికవర్గ శత్రువులకు మేం సలహాయిస్తున్నామనికూడా కృశ్చేవ్ అన్నారు.

సోషలిస్టు దేశాల్లోని ఏదేశంలో నైనాసరే కవ్వింపు చర్యలకి దిగి, విప్లవ ప్రతీఘాతక చర్యలకి ఒడిగట్ట ప్రయత్నిస్తే అన్ని సోషలిస్టు దేశాలు, సోవియట్ యూనియనూ ఈ క్షణంలో తమ బలాల్ని కూడగట్టుకుని సాయం అందించే స్థితిలో వున్నాయని, అంతటితో శ్రామికవర్గ శత్రువులకు తగిన సమాధానం లభ్యమవుతుందనికృశ్చేవ్ హెచ్చరించారు.

ఆ తర్వాత ఉక్కు కార్మికులను ద్దేశించి ప్రధాని కృశ్చేవ్ యింకా యిలా అన్నారు:

ఒకవేళ మరోదఫా విప్లవ ప్రతీఘాతక చర్యలు గనుక తలెత్తితే మళ్ళీ మనం రష్యన్లమీదే ఆధారపడవచ్చునే అని ఆలోచించకూడదు.

గత శనివారంనాడు 'ఫ్లాలిస్వాబోస్'లో కృశ్చేవ్ ఉపన్యాసాన్ని తప్పుగా చిత్రించిన పశ్చిమ దేశాల జర్నలిస్టుల్ని విమర్శిస్తూ కృశ్చేవ్ యిలా అన్నారు: ఫ్లాలిస్వాబోస్‌లోని మా హంగరీ మిత్రులకు చెప్పిందేమంటే-మన వ్యవహారాల్ని మనం నిర్వహించుకోవాలి. తత్ఫలితంగా దేశంలో కొత్తగా విప్లవ ప్రతీఘాతక చర్యలు తలెత్తవు. దానిలో రష్యన్లు మీకు సహాయం రావాల్సినంత పని వుండదు అని.

అయితే 'బూస్టువా' పత్రికలవారు దీన్ని—'హంగరీలో కొత్తగా విప్లవ ప్రతీఘాతక చర్యలు తలెత్తితే మరల సోవియట్ యూనియన్ మీకు సాయం చేయదని గుర్తుంచుకోవాలి' అని చిత్రించారని కృశ్చేవ్ అన్నారు.

మరోసారి కమ్యూనిస్టు పార్టీలో తప్పుల్ని అవకాశంగా తీసుకుపోదుకు విప్లవ ప్రతీఘాతకులకు హంగరీ శ్రామికవర్గం అవకాశంయివ్వదని, అలాగే ఆతప్పుల్ని మొత్తం సోషలిస్టు వ్యవస్థకి వ్యతిరేకంగా 

# 'నాటకాలలో కవికంటె నటుని ప్రాధాన్యత హెచ్చు'

## గొల్లప్రోలు నాటక కళాపరిషత్ సభలో డాక్టరు చాగంటి సన్యాసిరాజు ప్రసంగం

గొల్లప్రోలు, ఏప్రిల్ 6

నాటకాలలో కవి కంటె నటుని ప్రాధాన్యత హెచ్చుగా కలదని, కవి అభిప్రాయాన్ని మించి నటించి, సమన్వయం చేసుకోవడం నటుని బాధ్యత అని డాక్టరు చాగంటి సన్యాసిరాజు గారు కొప్పవరపు సుబ్బారావు స్మారక నాటక కళాపరిషత్ (గొల్లప్రోలు) సభలో అన్నారు.

శ్రీ పెరుమాళ్ల వెంకట రత్నం గారు అధ్యక్షత వహించారు. నాటక కళాపరిషత్తువారు నటరాజ డాక్టరు చాగంటి సన్యాసిరాజుగారికి ఘనసన్మానం చేశారు.

అధ్యక్షులు సన్యాసిరాజు గారి నటనా కౌశల్యాన్ని గురించి మాట్లాడుతూ, ఆంధ్ర శ్రీ లో బ్రహ్మనాయన, భిక్షీరాజ్య పతనంలో భిక్షీరాజున్నగు పాత్రలలో వారి నటన ఉన్నత స్థాయినందుకున్నదన్నారు.

శ్రీ ద్విభాష్యం వెంకటరమణయ్య గారు సన్యాసిరాజుగారి హావభావ నటనా కౌశల్యాన్ని గురించిచెప్పి వారిపై పద్యరత్నాలు రచించి సమర్పించారు.

శ్రీ సన్యాసిరాజుగారు ఉపన్యసిస్తూ, నాటకాల్లో నటకుల ప్రాధాన్యత కవికంటే హెచ్చుగాకలదని, కవి అభిప్రాయాన్ని మించి నటించి, సమన్వయం చేసికోవడం నటుని బాధ్యత అని చెప్పారు. నటునికుండవలసిన లక్షణాలు చక్కగా వివరించారు. నాటకాల్లో పద్యాలు అన్ని ఘట్టాలలోను పనికిరావు. అందుచేతనే గద్యంలో భావప్రకటనచేస్తూ నటిస్తాను. పద్యాలు పాడలేక కాదు. పద్యాలు పాడకపోయినా నాటకం రక్తికట్టగలదని నిరూపించటానికే తన నటన అని చెప్పారు. నటులందరు పూర్తిగా అర్థంచేసుకొని నాటకాన్ని ఆడటం అవసరమన్నారు.

కర్ణుడు కుంతినిజూచి పాడిన పద్యాలు గద్యంలో సరియైన భావ ప్రదర్శనతో స్వరంతో పలికి చూపించారు. సభాసదుల కోరికపై ఇంగ్లీషు నాటకం ఒథెల్లో పాత్రాభినయం జేసి ప్రేక్షకుల నానంద పరిచారు. జెస్టి మోనా మాటలుకూడా అభినయంచేసి చూపారు.

నాటక కళకు పాటుపడుతున్న సంస్థలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం లభించిన బాగుండునన్న అధ్యక్షుల అభిప్రాయంతో డాక్టరు సన్యాసిరాజుగారు ఏకీభవించారు. సంగీత నాటక ఎకాడమీ సభ్యులుగా తనచే అవసరమైన సేవ చేయించుకోవలసినదిగా కోరారు.

అధ్యక్షులు మాట్లాడుతూ శ్రీ చాగంటివారు నటరాజ బిరుదునకు తగినవారని నిరూపించు కున్నారన్నారు.

సమితివారి వందన సమర్పణతో సభ ముగిసింది.

జయరాం స్మారక నాటక కళా సమితి గూడూరు వారిచే "తీరుటి దొంగలు" నాటిక, నవోదయ కళా సమితి పిఠాపురం వారిచే "తిరుగుబాటు" నాటిక, ఆంధ్ర ప్రజా నాట్య కళాసమితి, కొత్తపల్లి వారిచే "పల్లెపడుచు', నాటకం పోటీ ప్రదర్శన లివ్వబడ్డాయి.

### మూడోరోజు కార్యక్రమం

మూడోరోజు సభకు డాక్టరు కె. భాస్కరరావుగారు (ఎం. బి. బి. ఎస్.) అధ్యక్షత వహించారు.

శ్రీ అంకరాజు శంకర్రావుగారు మాట్లాడుతూ, నాటకకళ పురాతన యుగం నుండి ఆధునిక యుగం వరకు ఎలాంటి పరిణామాలను పొందుతూ వచ్చిందో వివరించారు. శ్రీ తోలేటి కనకరాజు "రంగస్థలం దానివిశిష్టత"ను గూర్చి సంధీర్ఘోపన్యాసం చేశారు.

కార్యదర్శి వందన సమర్పణతో సభ జయప్రదంగా ముగిసింది.

శ్రీ వీరేశలింగం ఆర్ట్థియేటర్సు గా జమండ్రి వారిచే "ఈ రోజు బ్రాకెట్టు" నాటిక, ఆంధ్ర నాటకకళా సమితి, సామర్లకోటవారిచే "ఘల్ ఢిల్లీ" నాటిక, నవోదయ కళాసమితి, పిఠాపురం వారిచే "విశ్వశాంతి" నాటకం, శ్రీ గణేశ్వర నాట్యమండలి పెద్దాపురం వారిచే "పల్లెపడుచు" నాటకం పోటీ ప్రదర్శనలివ్వబడ్డాయి.

తూర్పుపాకిస్తాన్ వలసపక్షి వారి సంఖ్య సెప్టెంబరు ఫిబ్రవరి నెలల మధ్య పెరిగింది.

## 'కొత్తగుడి' నాటకం వాకరవాయిలో ప్రదర్శన

వాకరవాయి, ఏప్రిల్ 7

వాకరవాయి గ్రామంలో ఈ నెల 4 వ తేదీన పాఠశాలా భవన నిర్మాణ సహాయార్థం 'జనతా కళామండలి' (నూర్యాపేట) వారు శ్రీ కె. యల్. నరసింహారావు వ్రాసిన 'కొత్తగుడి' నాటకాన్ని ప్రదర్శించారు.

ఈ ప్రదర్శనకు ప్రముఖులు పలువురు విచ్చేశారు. దేశాభ్యుదయ కార్యక్రమానికి ప్రేరేపించే ఈ నాటకం అంతటా ప్రదర్శించడం అవసరమని వారు తమ అభిప్రాయం తెలిపారు.

ప్రదర్శన మాచాక 'ముత్తన్న' పాత్రధారి శ్రీ మూర్యనారాయణ కర్మగారికి కొందరు అధికార, అనధికార ప్రముఖులు బహుమతుల నిచ్చారు. అయితే ఆ బహుమతులు మండలికే చెందాలని శ్రీ కర్మగారు చెప్పారు.

ఈ నాటకాన్ని ఇప్పటికే అనేక సమాజాలవారు హైద్రాబాదు, నూర్యాపేట, నల్లగొండ, చేపాల మొదలైన ప్రదేశాల్లో ప్రదర్శించారు.

"గెలుపునీదే" అను నాటకాన్ని లోగడ వందలాది గ్రామాల్లో ప్రదర్శించి "జనతాకళా మండలి" వారు మెప్పు పొందారు.

## రేపల్లె పట్టణానికి విద్యుద్దీపాలు

### మంత్రి శ్రీ భగవంతరావు గారిచే ప్రారంభోత్సవం

రేపల్లె, ఏప్రిల్ 5

రేపల్లె పట్టణంలో విద్యుద్దీపాలకు మంత్రి శ్రీ అనగాని భగవంతరావు గారు నేడు ప్రారంభోత్సవంచేశారు. ఈ సందర్భంలో మునిసిపల్ ఆఫీసు ఆవరణలో సభ ఏర్పాటు చేయబడింది.

మునిసిపాలిటీవారు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నట్లయితే ప్రభుత్వపరంగా చేయదానికి వీలున్న సహాయమంతా చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. తాలూకాలోని అన్ని ముఖ్యగ్రామాలకు వ్యవసాయదారుల ఉపయోగార్థం విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి కృషిచేస్తానని చెప్పారు.

కమ్యూనిస్టు కౌన్సిలర్ శ్రీ మేకా రామకోటేశ్వరరావుగారు 27 లక్షల రూపాయలతో విద్యుచ్ఛక్తి పథకాన్ని అమలుజరిపిన ప్రభుత్వానికి, రెండు నెల్ల పదిహేనురోజుల్లో పట్టణానికి విద్యుచ్ఛక్తిని అందచేసిన ఇంజనీర్ల బృందానికి, అడిగినవెంటనే అంగీకరించి విద్యుచ్ఛక్తికి ప్రారంభోత్సవం చేసిన మంత్రికి, పురపాలకసంఘం తరఫున అభివందనాలు తెలియజేశారు.

మంత్రికి న్యాయవాదుల సంఘం వారు సన్మానం జరిపారు. ప్రముఖ న్యాయవాది, కీర్తిశేషులు అయిన శ్రీ ప్రభల సుబ్రహ్మణ్యంగారి తైల చిత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. తాలూకా టైస్‌మిల్లర్ల సంఘంవారు మంత్రికి సన్మానంజరిపి రాత్రికి విందు చేశారు.

పాత్రమెంటు సభ్యులు శ్రీ మండలి కృష్ణారావుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది.

తాలూకాలో నీటి వసతులు, మురుగు వసతులు, రోడ్డు రవాణా సౌకర్యాలు కలుగజేయవలసిందిగా మంత్రికి వినతి పత్రాలు సమర్పించబడ్డాయి. అందుకు మంత్రి సమాధానం చెబుతూ, తాలూకా అభివృద్ధి విషయంలో తాను చేయగలిగినదంతా చేస్తానన్నారు. శాసనసభ్యులు యడం చెన్నయ్యగారు స్థానిక అసుపత్రి ప్రజలకు వుపయోగపడుట లేదు కాబట్టి దానిని ప్రభుత్వం తీసికోవాలన్నారు.

శ్రీ మండలి కృష్ణారావుగారు భూ సంస్కరణల్ని వ్యతిరేకిస్తున్న వారిని, పంచవర్ష ప్రణాళికను కూల్చుటకు పాడవాలని ప్రయత్నంచేసే వారిని తీవ్రంగా విమర్శించారు.

## ఆంధ్రలో సిగరెట్ ఫ్యాక్టరీ స్థాపించాలి

అడుసుమల్లి, ఏప్రిల్ 7

నేషనల్ టుబాకో కంపెనీ అడుసుమల్లి బ్రాంచి వర్కర్సు యూనియన్ ద్వితీయ వార్షిక మహాసభ నిన్న అడుసుమల్లి గ్రామములో శ్రీ కొప్పులపూడి సూర్యనారాయణ గారి అధ్యక్షతనను జరిగింది. ప్రథమంలో యూనియను కార్యదర్శి అయిన శ్రీ తులసి వెంకటేశ్వర్లుగారు రిపోర్టు ప్రవేశపెట్టారు. అందులో ప్రధానంగా యిటీవల అడుసుమల్లి, మంగళగిరి, చిలకలూరిపేట, ఒంగోలు, గుంటూరు, బిక్కవోలు యూనియన్లు సమిష్టిగా ట్రిబ్యునలుకు వెళ్ళినమీదట కోర్టువారు యిచ్చిన తీర్పును వివరించారు. ఫ్యాక్టరీలకు ప్రస్తుత వేతనమునకు 0-8-0 రోజుకు పెంచారని, బ్రాంచీలకురోజుకు 0-5-0 వేతనం పెంచారని, అలాగే 2 నెలల బోనసు సంపాదించినారని, ఇది కార్మికులకు విజయమని అన్నారు. ఈతీర్పునుఅమలుజరిపించుకొనవలసిన బాధ్యత కార్మికులపైన వుందన్నారు. అనంతరం రాజమండ్రిలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జనరల్ కౌన్సిలు చేసిన తీర్మానాలనుకూడా వివరించారు. తరువాత జమా, ఖర్చులను ప్రవేశపెట్టారు. సభ్యులు చర్చించి, కార్యదర్శి రిపోర్టును జమా, ఖర్చులను ఆమోదించారు.

అనంతరం ఈ క్రింది తీర్మానాలు చేశారు:

పొగాకు పంటకు ప్రసిద్ధి నెందిన ఆంధ్రదేశములో ముఖ్యంగా గుంటూరులో ఒక సిగరెట్ ఫ్యాక్టరీ స్థాపించి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి.

చిలకలూరిపేట బ్రాంచిలో చనిపోయిన వారి స్థానే బదిలీలు చేర్చుకొని సహాయపడినారు. అలాగే అడుసుమల్లి బ్రాంచిలో కూడా చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబాల నుండి బదిలీలు తీసుకొనవలసిందిగా కంపెనీ అధికారులను కోరారు. బి. ఐ. టి. కంపెనీ యజమానులపలె, యిచట కూడా స్త్రీలకు ప్రసూతి సౌకర్యం కలిగించాలని కంపెనీని కోరుతూ తీర్మానించారు. నేషనల్ పొగాకు కంపెనీ కార్మికులందరికి ప్రావిడెంటుఫండు సౌకర్యం కలిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

యూనియను ప్రతినిధులపలహాతో సీనియారిటీ లిస్టులోవున్న పొరపాట్లను సవరించాలని ప్రభుత్వలేబరు ఆఫీసరుగార్ని కోరారు.

నూతన సంవత్సరమునకు కార్యనిర్వాహకవర్గంగా క్రిందివారిని ఎన్నుకొన్నారు:

అధ్యక్షులు దొప్పలపూడి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు బి. రామయ్య, ప్రధానకార్యదర్శి తులసి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బి. వెంకటరత్నం, కోశాధికారి శ్రీమతి ఆర్. శ్రీహరి. మరి 18 గురుతో కమిటీని యెన్నుకొన్నారు.

## పిట్టలవానిపాలెం హైస్కూలు సారస్వత సమితి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 7

పిట్టలవానిపాలెం హైస్కూలు సారస్వత సమితి వార్షికోత్సవం ఈ నెల 2, 3 తేదీలలో జరుపబడింది. మొదటిరోజున శాసనసభ్యులు శ్రీ మంతెన వెంకట్రాజుగారి అధ్యక్షతను తల్లిదండ్రుల మహాసభ, రెండవ రోజున చందోలుబోర్డు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ బి. వి. సత్యనారాయణగారి అధ్యక్షతను సారస్వత సమితి వార్షికోత్సవ సభలు జరిగాయి.

మాజీ ప్రధానోపాధ్యాయులు కీర్తిశేషులు అయిన శ్రీ గోకరాజు జానకిరామరాజుగారి చిత్రపటాన్ని శ్రీ మంతెన సత్యనారాయణ రాజుగారు ఆవిష్కరించారు. పాఠశాల చిహ్నాన్ని శ్రీ వేగేశన తమ్మిరాజు, పాఠశాల పత్రిక "మందారము"ను శ్రీ నారాయణం రఘునాథ చక్రవర్తిగారు ఆవిష్కరించారు.

రెండు రోజులు కళా సైజ్ఞానిక ప్రదర్శనాలుజరుపబడ్డాయి. పాఠశాల స్కౌట్సు, ఎ. సి. సి. విద్యార్థులు విన్యాసాలు జరిపారు. విద్యార్థినులు "లెజీమ్" డ్రిల్లు ప్రదర్శించారు. బాలబాలికలు నాటికలు, చిత్రకథలు, జానపద గీతాలు, ఏకపాత్రాభినయం మొదలగు వినోదాలు ప్రదర్శించారు. శ్రీ బి. వి. సత్యనారాయణగారు వివిధ పోటీలలో పాల్గొని బహుమందిన బాలబాలికలకు బహుమతులు పంచిపెట్టారు.

## కరీంనగర్ గోదాం బియ్యం అమ్మకంలో కుంభకోణం

### ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెసువాదుల చర్యలు

కరీంనగర్, ఏప్రిల్ 6

కరీంనగర్ తాలూకా వ్యవసాయ సహకారసంఘం (టాకా)లో జరుగుతున్న దుర్వినియోగాలగురించి శాసన సభ్యులు, టాకా డైరెక్టరు శ్రీ పి. చొక్కారావు, తాలూకా డైరెక్టరు శ్రీ జె. లక్ష్మారెడ్డిగార్లు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు.

కరీంనగరం తాలూకా వ్యవసాయ సహకారసంఘం (టాకా) లో గత కొన్ని సంవత్సరాలనుండి నానా అందరగోళాలు జరుగుచున్నవి. కాంగ్రెస్ శాసన సభ్యులు శ్రీ జె. చొక్కారావు, టాకా డైరెక్టరు శ్రీ రమాపతిరావు, టాకాకార్యదర్శి కలసి కరీంనగరం పట్టణంలో గారిశెట్టి వెంకటయ్య అనే వర్తకుని మధ్యవర్తిగా పెట్టుకొని కొన్ని సంవత్సరాలనుండి అక్రమ లాభాలు గడించుకుంటున్నారు. కాని స్థానిక అధికారుల బారిపై ఎలాంటి దర్యాప్తు తీసుకోపడంలేదు. 1955-56 ఆడిట్ రిపోర్టులో వీరు సాగించిన అక్రమ వ్యవహారాలు దానివల్ల టాకాకు వచ్చిన విపరీత నష్టం బైటపడినా ఏలాంటి చర్య తీసుకోలేదు. టాకా వ్యవహారాలను పైయిద్దరి నాయకులు స్వంతవ్యవహారాలుగా ఏ డైరెక్టర్లకు తెలియకుండా నడుపుతూ లాభాలు గడించుకుతున్నారు. ఒక వారంరోజుల క్రితం ప్రభుత్వ గోదాంలోని 6000 పల్లాల బియ్యం నిల్వలను ప్రభుత్వం టాకాపరం చేసి రైతులకు చౌక ధరలపైన సరఫరా చేయమని అప్పగించితే పైయిద్దరునాయకులు ఎవరికి తెలుపకుండా గారిశెట్టివెంకటయ్యకు మొత్తం బియ్యపునిలువలను అప్పగించారు. ఈ బియ్యపు నిల్వలను శ్రీ వెంకటయ్య నికింద్రాబాద్ కులాలపై తీరవేసి దొంగబజారులో మంచిలాభంపై అమ్మి దాదాపు 50, 60 వేల రూపాయలు సంపాదించడానికి ఎత్తువేశారు. రెండు మూడురోజులలోపున కొన్ని వందల పల్లాల బియ్యం అమ్మివేశారుకూడా. ఈ విషయం బైటపడటంతో కరీంనగరం పట్టణంలో చాలా అలజడి ఏర్పడింది. స్థానిక టాకా సభ్యులు 8 వ తేదీన అధికారులవద్దకుపోయి విషయాలు తెల్పారు. ఈవిధంగా పట్టపగలు ప్రజాద్రవ్యాన్ని దుర్వినియోగం చేస్తున్నా అధికారులు మెలుకువ వహించడంలేదు. అందుచేత వెంటనే ఈ కుంభకోణంపై విచారణ జరిపి తగువర్య తీసుకోవాలని కోరుతున్నాము. (వి. వి.)

## భువనగిరి తహశీల్‌దార్ అక్రమ చర్య

భువనగిరి, ఏప్రిల్ 6

భువనగిరి తాలూకా కాచారం గ్రామంలో సుంచు నల్లయ్య, రాజయ్య అను ఇద్దరు హరిజనులు సుమారు 25 సంవత్సరాలనుండి 20 ఎకరాలు భూమి కౌలుకు తీసుకుని సాగుచేస్తూ రక్షణ కౌలుదారు పత్రాలుకూడా పొందారు. కాని ఈభూమి ఆసామి, కాయితం నర్సయ్య రెండు సంవత్సరాలక్రితం కౌలుదార్లను తొలగించి కశిరెడ్డి సత్తెమ్మ అనే వారికి అమ్మారు. అందుపై కౌలుదార్లు ఫిర్యాదు చేసుకోగా అధికార్లు తిరిగి కౌలుదార్లకు భూమి యిప్పించారు. కాని కాయితం నర్సయ్య అప్పీలుచేసుకోగా కలెక్టరు పైన ఉత్తర్వు యిచ్చారు. కౌలుదారులు జోక్యమైరు వేసుకున్నారు. భూమి వారి స్వాధీనంలోనే ఉండగా ఈ ఉత్తర్వు జారీ చేయబడింది. చట్టం ప్రకారం అప్పీలుపై విచారణ జరిగిన తరువాత భూమి ఎవరి స్వాధీనం చేయాలోనిర్ణయించటం న్యాయంకాని భూమిని కశిరెడ్డి సత్తెమ్మకు తహశీల్‌దారు స్వాధీనపరిచారు. ఇందులో కాంగ్రెస్ వాదుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ విషయమై అధికారులు విచారణ జరిపి కౌలుదార్లకు తగు న్యాయం చేయాలని తాలూకా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ ఎమ్. ప్రకాశరావుగారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నర్సరావుపేట అడిషనల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేటు శ్రీ దర్శి వెంకట సుబ్బారావుగారి పదవీ విరమణ సందర్భంలో విశ్వకర్మ వసతిగృహం వారు అల్పాహారవిందు చేశారు.

## తెప్పలు

### ప్రభుత్వ కళాశాలలలో తాత్కాలికోపాధ్యాయులు

మహాశయా,

ఆంధ్ర ప్రభుత్వ కళాశాలలలో తాత్కాలిక పద్ధతిపై పనిచేయు ఉపాధ్యాయులకు వేసంగి సెలవుల మూడు నెలల జీతము కాలేజీ మూల తెరువబడినపుడు జూలై ఒకటవ తేదీన యివ్వబడు చున్నది. అసలే చాలీ చాలని జీతములతో ఉపాధ్యాయులు పనిచేయు చున్నారు. ప్రభుత్వపు కళాశాలలలో తాత్కాలిక పద్ధతిపై పనిచేయు ఉపాధ్యాయులు చాలా మంది గలరు. అందులో అందరూ కాకపోయిననూ కనీసము కొంతమందికి యింటిఖర్చ పేరే ఆస్తిపాస్తులులేక కేవలము తమకువచ్చు జీతముమీదనే ఆధారపడి యుండవలసి వచ్చుచున్నది.

అట్టి పరిస్థితులలో మూడు నెలల జీతము యే నెలకానెల యివ్వక మూడు నెలల తరువాత యిచ్చినచో వారు ఎన్ని కష్టనష్టములకు గురికావలయునో తేలికగా ఊహింపదగిన విషయము. ఈ విషయము అధికారుల దృష్టికి తీసుకొని వచ్చినను ఫలితము గలుగలేదు. కొంతమంది శాసన సభ్యుల దృష్టికి గూడ ఈ విషయము తీసుకొని రాబడినది. కాని వారు తమకు పట్టినట్లు పైపెచ్చు అందులో వారికి అనుచిత విషయమేమి కనబడనటుల మాట్లాడారు. కాన పత్రికా సంపాదకులు, పాఠకులు ప్రభుత్వము మీద ఒత్తిడితెచ్చి తాత్కాలిక పద్ధతిపై పనిచేయు ఉపాధ్యాయులకు న్యాయము గలుగునట్లు చూతురని విజ్ఞప్తి.

ఇట్లు,
బి. కృష్ణమూర్తి, ఎం. ఏ.

### గూడెంతాలూకాలో మైనర్ ఇరిగేషన్ పనులు

మహాశయా,

విశాఖజిల్లా గూడెం (చింతపల్లి) తాలూకా పెదవలసుతూనుండి అనేక సెలయేళ్ళు ప్రవహించుచున్నాయి. 25-30 వేల రూపాయలు ఖర్చుచేసి, వ్యర్థంగాపోతున్న నీటిని ఆదుపులో పెట్టితే, సుమారు వెయ్యి ఎకరాల భూమి బుడ్డోబన్ల సహాయం లేకుండా ఎట్టి మరమ్మత్తు లేకుండా యేడాదిలో రెండు పంటలు పండేభూమిగా మారుతుంది.

మహారణ్యాలు వున్నవి చాలక, చిట్టిడవితోయున్న వందలాది ఎకరాల భూమి మైదానప్రాంతాన్ని ఆటవీశాఖవారు ఆక్రమించడం సబబుగాలేదు. పోడు వ్యవసాయం నిషేధంతో వచ్చిన యిబ్బంది ఏజెన్సీ ప్రజలకు ఎంతగనో బాధపెడుతుంది. ఈ సందర్భములో వ్యవసాయానికి అనుకూలమైన మైదాన ప్రాంతాలను ఆటవీశాఖవారి కాపలాకు విడచుట న్యాయంకాదు.

పొడుపల్లి గ్రామానికి ఉత్తర దిశగా ప్రవహిస్తున్న పెద్దగెడ్డకు "మేడలసుట్ట"వద్ద ఆడ్డకట్టు నిర్మిస్తే వందిన్నర ఎకరాలభూమి సాగుకు వస్తుంది. అయితే ఈ భూమి ఆటవీశాఖవారి ఆధీనంలోవుంది. కాబట్టి ప్రభుత్వ ఏజెన్సీ ప్రజల శ్రేయోభివృద్ధి ప్రయోజనాలదృష్ట్యా సాగుకు లాయకైన భూమిపై ఆటవీశాఖ ఆధీనం తిరిగించుట సుంచిది.

అదే మూలాలో గర్రెల గెడ్డకు, "సుద్దగొయ్యి" వద్ద ఆడ్డకట్టు నిర్మిస్తే 200 ఎకరాల భూమి, చింతపల్లి సమీపము నుండి ప్రవహిస్తున్న ఇసుకగెడ్డకు రింతాడ బ్రిడ్జివద్ద ఆనకట్ట నిర్మిస్తే సుమారు అయిదారు వందల ఎకరాల భూమి ఆదుపులోనికి వస్తుంది ప్రతి రైతుకుటుంబానికి సు 300 లు నీళ్ళ కాలం ఋణం మంజూరు చేయాలి.

ఇట్లు,
మేకా సూరిబాబు.

### పనపర్తిలో వీధిదీపాలు

మహాశయా!

పనపర్తి పట్టణంలోని ప్రైవేటు విద్యుచ్ఛక్తి సరఫరాకంపెనీని మూసివేయడం వలన వీధిదీపాలులేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అందుచేత కంపెనీని యథాప్రకారం నడిచేటట్లు ప్రభుత్వం తగుచర్య తీసుకోవాలని కోరుతున్నాను.

ఇట్లు,
టి. రెడ్డి, పనపర్తి.

### తిరువూరు ప్రాంతంలో బస్ రవాణా సౌకర్యం

మహాశయా,

తిరువూరు, ఫుల్బేల, నూజివీడు టైమలోను, తిరువూరు, రాజవరం

## హైద్రాబాద్ హిందీ ప్రచారక విద్యాలయం

### ఏప్రిల్ 13 వ తేదీన ప్రవేశ పరీక్ష

హైద్రాబాద్, ఏప్రిల్ 7

హైద్రాబాద్ హిందీ ప్రచారక విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీ బాలచంద్ర ఆప్టేగారు ఇలా వ్రాస్తున్నారు.

"తెలంగాణా ప్రాంతంనుండి హైదరాబాద్ హిందీ ప్రచారసభవారి "భూషణ" పరీక్షగాని, సాహిత్య సమ్మేళనంవారి "సాహిత్య రత్నం" పరీక్షగాని ప్యాసైయుండి దక్షిణభారత హిందీప్రచార సభవారి రాష్ట్ర భాషా ప్రవీణ, ప్రచారక కోర్సులపై హిందీ ప్రచారక విద్యాలయములో జేరగోరు విద్యార్థులకు ఏప్రిల్ 18 వ తేదీ ఆదివారం 9 గంటలకు ప్రచారక విద్యాలయములో ప్రవేశ (అడ్మిషన్) పరీక్ష జరుపబడును. పరీక్షలో కూర్చుండగోరు విద్యార్థులు ఆ సమయమునకు హైద్రాబాద్, చెంచెలగూడలోని గవర్నమెంటు ప్రెస్‌కు ఎదురుగా నున్న హిందీ ప్రచారక విద్యాలయములో హాజరు కాగోరుచున్నాము."

## కృష్ణాజిల్లావర్జీనియా పొగాకు రైతుల సమావేశం

### 13 వ తేదీన, గొల్లపూడిలో

విజయవాడ, ఏప్రిల్ 8

కృష్ణాజిల్లా వర్జీనియా పొగాకు రైతుల సమావేశం 13 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గొల్లపూడి బి. ఎల్. టి. డి. కంపెనీవద్ద, కృష్ణా మార్కెటింగ్ యార్డుభవనంలో జరుగుతుంది. పొగాకు సంబంధించిన ఉద్యోగులుకూడా పాల్గొంటారు. గనుక జిల్లాలోని రైతులు అభిమానులు పాల్గొనాలని సమావేశకర్తలు కోరుతున్నారు.

### అన్నపర్రు

గుంటూరు తాలూకా అన్నపర్రు గ్రామంలోహరిజనులసంక్షేమంకోసం సుమారు 40 వేల రూపాయల విలువగల ఇండ్లస్థలాలు, విద్యార్థులకు వెయ్యి లైనవి దానంచేసిన గడ్డం హనుమయమ్మగారు మార్చి 15 వ తేదీన మృతి చెందారు. ఈ సందర్భంలో 5 వేలమంది పేదలకు అన్నదానం జరిగింది.

కేరళలో జీడిపప్పు వ్యాపారానికి ఒక వ్యాపారసంస్థను నెలకొల్పడం ఉచితం అని కేరళ పరిశ్రమలమంత్రి జీడిపప్పు పారిశ్రామికులకు సూచించారు.

లైసులోను బస్‌లు తగినన్ని లేక పోవడంవలన ప్రయాణీకులు చాలా యిబ్బంది పడుతున్నారు. అందుచేత ఈ ప్రాంతంలో రోడ్ రవాణా కార్పొరేషన్‌వారు అదనపు బస్‌లను నడిపించాలి.

ఇట్లు,
ఎ. జగన్నాథాచారి,
తిరువూరు.

## బజారు ధరలు

విజయవాడ, ఏప్రిల్ 9

[మధ్యాహ్నం గం॥ 1 కరకు]

### బంగారం ధరలు

| | | |
|---|---|---|
| మేలిమి: పాట్లా | రు. 112 | 8 0 |
| మూస | 112 | 4 0 |
| నగరము | 78 | 8 0 |
| కండి: 100 తులములు | 195 | 0 0 |
| 1 తులము | 2 | 0 0 |

### ధాన్యం ధరలు

| | | |
|---|---|---|
| 24 నెంబరు (కొత్తది) | రు. 26 | 0 0 |
| వంకసన్నాలు | 23 | 12 0 |
| 12 నెంబరు | 23 | 8 0 |
| అక్కుర్లు | 22 | 12 0 |
| కనుము | 22 | 12 0 |
| కొణామణి | 22 | 8 0 |

### బియ్యం ధరలు

| | | |
|---|---|---|
| 24 నెంబరు (కొత్తది) | రు. 60 | 0 0 |
| వంకసన్నాలు | 55 | 0 0 |
| 12 నెంబరు | 54 | 0 0 |
| అక్కుర్లు | 52 | 8 0 |
| కనుము | 52 | 0 0 |
| కొణామణి | 52 | 0 0 |

### అపరాల ధరలు

| | | |
|---|---|---|
| మినుములు 240 పౌ॥ | రు. 48 | 0 0 |
| కందులు 80/- | 87 | 0 0 |
| నల్లపెసలు(మూగాణి) | 51 | 0 0 |
| పచ్చపెసలు 280 పౌ॥ | 51 | 4 0 |
| పచ్చపెసలు (మెట్టది) | 50 | 0 0 |
| పెసరలు (శేవాళ్) | 85 | 8 0 |
| ,, (పంజాబు) | 82 | 8 0 |
| ఫనియాలు 90 పౌనులు | 24 | 0 0 |
| ఉలవలు | 86 | 8 0 |
| ఆముదాలు | 42 | 0 0 |
| పంచదార (ఉయ్యూరు) | 107 | 8 0 |
| కొబ్బరినూనె డబ్బా | 38 | 14 0 |
| వెల్లుల్లి మణుగు 6 8 0 | 7 | 0 0 |
| బెల్లం ,, 2 12 0 | 4 | 10 0 |
| మిర్చి ,, 16 0 0 | 18 | 0 0 |
| నీరుల్లి ,, 1 1 0 | 1 | 4 0 |
| చింతపండు ,, 3 10 0 | 5 | 0 0 |
| నువ్వులనూనె ,, | 82 | 8 0 |
| పేరేశనగ పప్పు 177 పౌ॥ | 59 | 8 0 |
| | 60 | 0 0 |
| ,, నూనె మణుగు | 15 | 10 0 |
| కేక్ 160 పౌనులు | 17 | 0 0 |
| కొబ్బరికాయలు 1000 | 178 | 0 0 |
| సంచులు 100 | 102 | 12 0 |
| ఫార్వర్డు ఏప్రిల్ వాయిదా | 94 | 4 0 |

తెనాలి బొగ్గుగనుల్లో గానుల విభాగాల్ని మాత్రమే ద్వితీయ ప్రణాళిక మూలబంధంలో చేర్చారు.

## టెండరు ప్రకటన

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం తాలూకా పెమ్మరాజు పోలవరం పంచాయితీ బోర్డు లిమిట్సులో గల నూరయ్య చెరువు త్రవ్వుటకుగాను ది 12-4-58 సాయంత్రం 4 గంటల వరకు సీలు చేసిన టెండర్లు తీసుకొనబడును. మిగతా వివరములు ఆఫీసు పనిచేయు కాలములో తెలుసుకొనవచ్చును.

ఎస్టిమేటు విలువ రు. 1803-0-0
నూటికి రు. 5/- లు డిపాజిట్టు కట్టవలెను.

మానేపల్లి వెంకటస్వామి,
ప్రెసిడెంటు - పంచాయితీ
పెమ్మరాజుపోలవరం, 5-4-58.

గాలిచొరకుండా తయారు చేయబడిన అట్టపెట్టెలలోని బిస్కట్లు కొనండి




గాలిచొరకుండా తయారు చేయబడినందువలన అట్టపెట్టెలలో గల బిస్కట్లు కాస్త కాగితాలలో గాని, అట్టపెట్టెలలో గాని పెట్టడానికి వీలులేని వస్తువులను మాత్రమే రేపటి ఉపయోగించేటట్లు సహాయపడుతుంది.

సాతే బిస్కట్లు
'కరకరలాడేవి, రుచికరమైనవి'

FBMI
HEROS INSIGNIA

సాతే బిస్కట్ & చాకొలెట్ కం. లిమి., పూనా-2

# బస్సురవాణా జాతీయంపై యజమానుల రిట్ పిటీషన్లు

## ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కొట్టివేత

హైద్రాబాద్, ఏప్రిల్ 8

ప్రభుత్వం బస్సురవాణాను జాతీయం చేయడాన్ని సవాలుచేస్తూ కృష్ణాజిల్లాలోని కొంతమంది బస్సు యజమానులు దాఖలు చేసుకొన్న తొమ్మిది రిట్ పిటీషన్లను నేడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచి త్రోసివేసింది.

ప్రధాన న్యాయమూర్తి శ్రీ సంద్రా రెడ్డి, న్యాయమూర్తి శ్రీ పి. సత్యనారాయణరాజుగార్లు గల డివిజన్ బెంచి యీ పిటీషన్లపై తీర్పునిస్తూ ఏవైనా వ్యాపారాన్ని తాను తీసుకోవడానికిగాని, లేక తాను నియమించినఒక కార్పొరేషన్‌కుఅప్పగించడానికిగాని ప్రభుత్వానికి అధికారం గలదన్నారు. బస్సులరవాణాను జాతీయం చేయడంలో ప్రభుత్వం తీసుకొన్నచర్య మన రాజ్యాంగంలోని 19 వ నిబంధనకు ఏ మాత్రం విరుద్ధం కాదనికూడా స్పష్టంచేశారు.

పిటీషనర్లు తాము చాలకాలంగా వ్యాపారం చేస్తూన్నామనీ, బస్సులరవాణాను జాతీయం చేయడంవలన తమకు చాలనష్టం కలుగుతున్నదనీ, అందుకలన ప్రభుత్వం ఇలా చేయడం పౌరుల ప్రధాన హక్కులను నిరాకరించడమే కాగలదని తమ రిట్ పిటీషన్లలో పేర్కొన్నారు.

పరిమిట్‌ను త్రోసిపుచ్చి నష్టపరిహారంచెల్లించవలసినప్పుడే శాసనం చేయవలసిన అవసరం గలదనీ ఇప్పుడు ఈ సందర్భంలో ప్రభుత్వం ఆయా బస్సురూట్ల పర్మిట్లను తిరిగి పునరుద్ధరించడానికి నిరాకరించి, రూట్లను స్వాధీనం చేసుకున్నదిగాబట్టి శాసనం తీసుకొనివలసిన అవసరం లేదని కూడా న్యాయమూర్తులు తమతీర్పులో పేర్కొన్నారు. (వి. వి.)

# అమ్ముకంపన్ను సలహాసంఘం

## నష్టాలను నియమిస్తూ ప్రభుత్వ ప్రకటన

హైద్రాబాద్, ఏప్రిల్ 8

ఆంధ్ర ప్రభుత్వం అమ్ముకం పన్ను సలహాసంఘాన్ని పునర్నిర్మించింది. ఈ సంఘం రెండేండ్లపాటు పని చేస్తుంది.

సలహా సంఘంలో ఈ క్రింది సభ్యులు నియమించబడ్డారు:

అధ్యక్షుడు: వాణిజ్య పన్నులను చూసే మంత్రి.

కార్యదర్శి: వాణిజ్య పన్నుల శాఖనునిర్వహించే ప్రభుత్వకార్యదర్శి.

సభ్యులు: (1) శ్రీ యు. కు. లు పుచ్చలపల్లి సుందరయ్య, (2) టి. బాలయ్య, (3) సందా నారాయణప్ప (4) వాసుదేవ కృష్ణాజీ నాయక్ (5) కొత్తూరు సీతయ్య గుప్త (6) రంగారెడ్డి (వీరంతా శాసన సభ్యులు) (7) కృష్ణా జిల్లా వర్తకుల సంఘ అధ్యక్షుడు. (8) డాక్టర్ బి. సర్వేశ్వరరావు. యమ. ఎ. పి. హెచ్ డి (ఆంధ్ర యూనివర్శిటీలో ఆర్థిక, సాంఘిక శాస్త్రాల శాఖ అధిపతి) (9) శ్రీ టి. జనార్దన్‌రావు దుగ్గిరాల, గుంటూరుజిల్లా (10) శ్రీ దుడ్లర రంగయ్య, కొడవళూరు, నెల్లూరుజిల్లా, (11) శ్రీ మేడా రామయ్యశెట్టి, అనంతపురం, (12) శ్రీ సయ్యద్ కాశిం, (13) శ్రీ రామిని మృత్యుంజయలింగం (వరంగల్) (14) శ్రీమహమ్మద్ సిద్దికీ, సికింద్రాబాద్, (15) శ్రీ వి. బాలయ్య, బట్టల వర్తకుడు కాచిగూడా, హైద్రాబాద్. (వి. వి.)

# కేరళలో బస్సు జాతీయకరణ

తిరువనంతపురం, ఏప్రిల్ 7

కేరళ ప్రభుత్వం మరో ఎనిమిది రూట్లలో బస్సులను జాతీయం చేయటానికి నిర్ణయించింది.

ఇప్పుడు 250 రూట్లలో ప్రభుత్వ బస్సులు నడుస్తున్నాయి. అవి 4,963 మైళ్ళ రూట్లలో తిరుగుచున్నాయి.

కేరళ ప్రభుత్వం అర్డినెన్సుల ఫ్యాక్టరీల్లో పనిచేసేవారికి కనిస వేతనాలు నిర్ణయించడంకోసం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో యజమానుల ప్రతినిధులు నలుగురు, కార్మికుల ప్రతినిధులు నలుగురు వుంటారు.

# ప్రదేశ్ కాంగ్రెసుకు నూతన అధ్యక్షుడు

## ఏప్రిల్ 24 వ తేదీన ఎన్నిక

హైద్రాబాద్, ఏప్రిల్ 8

ప్రదేశ్ కాంగ్రెసుకు కొత్త అధ్యక్షుణ్ణీ, కార్యవర్గాన్ని ఎన్నుకొనేందుకు ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు సర్వసభ్య సమావేశం 24 వ తేదీ సాయంత్రం మూడుగంటలకు హైద్రాబాద్‌లోని గాంధీభవనంలో సమావేశ మవుతుంది.

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ఢేబర్ ఇక్కడ మూడు రోజులపాటు వున్నప్పుడు ఆంధ్ర కాంగ్రెసులోవున్న రెండు ముఠాలు ఒకరిపై మరొకరు చేసుకొన్న ఆరోపణలనుగురించి, విచారణ జరిపించినట్లు తెలుస్తోంది. అన్నీ విన్నతరువాత ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గంలో చెన్నారెడ్డి, లచ్చన్నగార్ల వర్గానికి స్థానం యివ్వవలసిందిగా శ్రీ సంజీవరెడ్డికి ఢేబర్ సలహాయిచ్చి వెళ్ళినట్లు తెలుస్తోంది.

ఆ తరువాత శ్రీ చెన్నారెడ్డిని సంప్రదింపులకు శ్రీ సంజీవరెడ్డి ఆహ్వానించారు. వారిరువురూ వివిధ సమస్యలపై - మంత్రి వర్గాన్ని విస్తరింపడేనే సమస్యతో సహా చర్చించినట్లు తెలుస్తోంది. (వి. వి.)

# కాశ్మీర్‌లో రజాకార్ సంస్థ

## అబ్దుల్లా నిర్మిస్తున్నట్లు ప్రధాని బక్షీ వెల్లడి

జాంబాయి, ఏప్రిల్ 8

ఇంతకుపూర్వం హైద్రాబాద్‌లో ఏర్పడిన రజాకార్ సంస్థవంటి ఒక వలంటీరు దళాన్ని ప్రస్తుతం కాశ్మీరులో షేక్ అబ్దుల్లా నిర్మించుతున్నాడనీ, అందుకోసం విరాళాలనుకూడా విరివిగా వసూలు చేస్తున్నాడని కాశ్మీరు ప్రధాని బక్షీ నేడిక్కడ పత్రికా ప్రతినిధులకు తెలిపారు.

రంజాన్ నెలనుండి షేక్ అబ్దుల్లా ఇప్పటివరకూ ఒక్కబహిరంగసభలో కూడా ప్రసంగించలేదని బక్షి చెప్పారు.

షేక్ అబ్దుల్లా ఒకప్పుడు కాశ్మీరులో తిరుగులేని నాయకుడైనప్పటికీ, ఇప్పుడు ఆయన ఆస్థితిని కోల్పోయాడని బక్షీ చెప్పారు.

# చైనాలో మావో పర్యటన

## కమ్యూనిస్టుపార్టీ తొమ్మిదవ మహాసభ సందర్భంలో

పెకింగ్, ఏప్రిల్ 6

ఈ నెలాఖరుకు జరగబోయే చైనా కమ్యూనిస్టుపార్టీ తొమ్మిదవ మహాసభ సందర్భంలో చైనా అధ్యక్షులు మావో సేటుంగ్ దేశమంతటా పర్యటించుతున్నట్లు తెలుస్తోంది.

వారాంతంలో మావో, ప్రధాని చౌ ఎన్ లై తోపాటు పెద్ద పారిశ్రామిక ప్రాంతమైన యాంగ్జీ నగరానికివెళ్ళారు. అక్కడ 5,300 మంది శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు హాజరైన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

# పశ్చిమ రాజ్యాల సూచనకు ట్యునీషియా నిరాకరణ

పారిస్, ఏప్రిల్ 6

ఆల్జీరియా ట్యునీషియా సరిహద్దులను అంతర్జాతీయ తనిఖీక్రిందవుంచాలని పశ్చిమ రాష్ట్రాలుచేసిన సూచనను తాము ఎట్టిపరిస్థితులలోను ఆమోదించబోమని ట్యునీషియా ప్రధాని బోర్గ్విబా ఇటలీ రేడియో ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

# పార్టీ నిబంధనావళి

(1వ పేజీ తరువాయి)

వామపక్షాలవైపు మొగ్గు పెరుగుతున్నదనే విషయాన్నే కాకుండా, కాంగ్రెసుకు ప్రత్యామ్నాయశక్తి కమ్యూనిస్టు పార్టీయేనని ప్రజలు నానాటికి ఎక్కువగాగుర్తిస్తున్నారనిసూచిస్తున్నాయి.

సంఖ్యాబలం విషయంలోనూ నిర్మాణం దృష్ట్యానూ పార్టీలో ఉన్న బలహీనత ఈ అనుకూల పరిస్థితికి పూర్తిగా భిన్నంగాఉంది.

ఇందువల్ల, కమ్యూనిస్టుపార్టీని విస్తృతమైన ప్రజా ప్రాతిపదికగల పార్టీగా రూపొందించ వలసిన అవసరం ఏర్పడింది. ఇంతవరకు సాధించిన విజయాల నన్నిటినీ పదిలపరచుకొని, ముందుకు సాగిపోగల పార్టీగా పునర్నిర్మించాలి.

అంతేకాకుండా మరొక ముఖ్య విషయాన్నిబట్టికూడా పార్టీ నిబంధనావళిలో మార్పులు అవసరమయాయి. ప్రపంచమంతటా శాంతి, సోషలిస్టుశక్తులు బ్రహ్మాండంగా బలపడ్డాయి. భారతదేశంలోకూడా ప్రజాతంత్రశక్తుల బలం ఇనుమడిస్తూఉంది. ఈ పరిస్థితిలో సంపూర్ణ ప్రజాస్వామ్యాన్నీ, సోషలిజాన్నీ శాంతియుత మార్గాలద్వారా సాధించగల అవకాశాలున్నవని, కమ్యూనిస్టుపార్టీ గుర్తించింది. ఎన్నికలద్వారా కేరళలో కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరచడంకూడా దీనికి మార్గదర్శకం. అయితే ఇందుకు అవకాశాలున్నవని మాత్రమే చెప్పగలముకాని, ఇదేఖాయం అనేమీ చెప్పలేము.

అవసరంవస్తే ప్రజల్ని విప్లవ కార్యాచరణవైపు నడిపించగల విస్తృత ప్రజా ప్రాతిపదికగల పార్టీగా కమ్యూనిస్టుపార్టీని రూపొందించడంకోసం స్వేచ్ఛగానూ, బహిరంగంగానూ కృషి చేసుకుడానికి ఇప్పుడు అవకాశంఉంది. ఈ అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రస్తుత నూతన పరిస్థితికి అనుగుణంగా ఉండేలా పార్టీ నిబంధనావళిని మార్చడానికి కేంద్రకమిటీ నిశ్చయించింది. అయితే, చేయబోయే మార్పులు ఎటువంటి వయినప్పటికీ మార్క్స్, లెనిన్ మహాశయులు నిర్వచించిన పార్టీ నిర్మాణ సూత్రాలకు అవి అనుగుణంగానే ఉండాలి.

## కమ్యూనిస్టుపార్టీ విశిష్టత

కమ్యూనిస్టుపార్టీ నిర్మాణంలోని ప్రధానాంశాలను శ్రీ అధికారి వివరించారు. ఇతర సోషలిస్టు, బూర్జువా పార్టీలకూ, కమ్యూనిస్టు పార్టీకీ వ్యత్యాసం ఏమిటో తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలోని ప్రజాతంత్ర కేంద్రీకరణ సూత్రాన్ని ఈ సందర్భంలో ఉదహరించారు. ఈ సూత్రం అంటే—ప్రజలముందు ఒక విధానాన్ని పెట్టడం, దానిమీద వారి అనుభవాలనూ, అభిప్రాయాలనూ సేకరించడం, వాటి ఆధారంతో లోటుపాటులను సవరించి, నిర్దుష్ట విధానాన్ని తిరిగి ప్రజలకు అందివ్వడం అన్నారు.

కొత్త నిబంధనావళి పీఠికలోని అతి ప్రధానాంశాన్ని శ్రీ అధికారి ప్రతినిధుల దృష్టికి తెచ్చారు.

కార్మికవర్గంయొక్క అంతర్జాతీయ తత్వానికి పార్టీ విధేయతనూ, పార్టీ స్వతంత్రప్రతిపత్తినీ యీ పెన వేయడమే ప్రధానాంశం. కార్మికవర్గఅంతర్జాతీయ తత్వానికి లోబడి ఉంటూనే భారత కమ్యూనిస్టుపార్టీ భారత ప్రజల ప్రయోజనాలకూ, జాతీయ అవసరాలకూ అనుగుణమైన విధానాలను రూపొందించుకుంటూ ఉంటుంది.

## కమ్యూనిస్టు ప్రభుత్వాలకింద ప్రతిపక్షాల హక్కులు

కమ్యూనిస్టు ప్రభుత్వాలకింద ప్రతిపక్షాలకు నిర్మాణ స్వాతంత్ర్యము, వాక్, పత్రికా స్వాతంత్ర్యాలూ ఉంటాయని ఈ పీఠికలో ఈ అంశాన్నికూడా శ్రీ అధికారి తన ప్రసంగంలో పేర్కొన్నారు. కమ్యూనిస్టు పాలనకింద అందరిస్వాతంత్ర్యాలనూ అణచివేస్తారని దుష్ప్రచారం చేసేవారికి పీఠికలోనిఈఅంశంచక్కటి జవాబని డాక్టరు అధికారి అన్నారు.

దేశంలో సోషలిజాన్ని నిర్మించేందుకు హృదయపూర్వకంగా కృషి చేయగోరే ప్రజాతంత్రవాదులు, దేశభక్తులూ హర్షించగల పత్రం ఈనిబంధనావళి అని చెప్పి డాక్టర్ అధికారి తనప్రసంగాన్ని పూర్తి చేశారు.

ఆ తరువాత, అంశాల వారీగా సమగ్రమైన చర్చ ప్రారంభమయింది. మూడు గంటలసేపు ఈ చర్చలు సాగిన మీదట పీఠికలోని తొలిరెండు పేరాలనూ, కొన్ని సవరణలతో సభవారు ఆమోదించారు.

## మరికొన్ని వివరాలు

పార్టీ కొత్త నిబంధనావళిపై నిన్న ప్రారంభమైన చర్చ నేడు కూడా కొనసాగిందని పి. టి. ఐ. వార్తా సంస్థ తెలుపుతూంది.

నేటి సమావేశంలో నిబంధనావళి పీఠికను మహాసభ ఆమోదించింది. కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వాలకింద ప్రతిపక్షాలకు నిర్మాణ, వాక్, సభా, పత్రికా స్వాతంత్ర్యాలుంటాయి అనే అంశానికి, "ఆ పార్టీలు దేశ రాజ్యాంగచట్టానికి బద్ధులై వ్యవహరిస్తున్నంతకాలం" అని పశ్చిమ బెంగాల్ ప్రతినిధి ఒకరు ప్రతిపాదించిన సవరణ అత్యధిక మెజారిటీ ఓటులో నెగ్గిందని ఈ వార్తా సంస్థ తెలుపుతూంది.

పీఠికలో యీ క్రింది అంశాలు కూడా ఉన్నట్లు పి. టి. ఐ. వార్తా సంస్థ తెలియజేస్తోంది.

"శాంతియుత మార్గాలద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్నీ నెలకొల్పేందుకూ, అన్ని రంగాలలోనూ అత్యంత అభివృద్ధిని సాధించి వాక్ సభా, పత్రికా, నిర్మాణ స్వాతంత్ర్యాలను బాగా విస్తృతం చేయగల సోషలిస్టు సమాజాన్ని స్థాపించేందుకూ కమ్యూనిస్టుపార్టీ పాటుపడుతుంది.

"బలమైన ప్రజా ఉద్యమాలను పెంపొందించడం ద్వారా, పార్లమెంటులో మెజారిటీబలాన్ని సాధించడం ద్వారా, ఆ మెజారిటీ బలానికి ప్రజల అండదండలను చేకూర్చడం మూలంగా, కార్మికవర్గమూ దాని మిత్రవర్గాలూ అభివృద్ధి నిరోధక వర్గాల ప్రతిఘటనను అధిగమించి, ఆ పార్లమెంటు ప్రజావాంఛలను నెరవేర్చగల సాధనంగానూ, ఆర్థికసామాజిక పరిపాలనా వ్యవస్థల్లో ప్రధానమైన మార్పులు తేగల సాధనంగానూ రూపొందేలా చేయగలవని భారత కమ్యూనిస్టుపార్టీ భావిస్తూంది."

నిబంధనావళిలోని ఇతర అంశాలపై రేపటినుండి చర్చప్రారంభమవుతుందని పి. టి. ఐ. వార్తా సంస్థ తెలుపుతూంది.

# కాంగ్రెస్‌ను, కమ్యూనిస్టుపార్టీనీ అనుసరించే వారిమధ్య ఐక్య కార్యాచరణకు అవకాశాలు

## అమృతసర్ మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానంలో మరికొన్ని అంశాలు

రత్నసింగ్‌నగర్, ఏప్రిల్ 8

కాంగ్రెసునూ, కమ్యూనిస్టుపార్టీనీ అనుసరించే వారందరూ కలిసి, ఉభయులకు అంగీకారయోగ్యమైన అనేక అంశాలపై ఐక్యకార్యాచరణ సాగించడానికి అవకాశం కలదని కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ తయారు చేసిన ముసాయిదా రాజకీయ తీర్మానంలో వ్యక్తం చేశారు.

[ముసాయిదా రాజకీయ తీర్మానంలోని కొన్ని భాగాలను లోగడనే ప్రకటించాం. ఆలస్యంగా అందిన మరికొన్ని భాగాలను ఇప్పుడు ప్రకటిస్తున్నాం. —సం.]

రాజకీయ ముసాయిదా తీర్మానంలో ఇలా వుంది:

"భారత ప్రభుత్వ వైదేశికనీతిని బలపర్చుతూ, దానిని ప్రజలలో విరివిగా ప్రచారంచేసే విషయంలోను, రెండో ప్రణాళికోద్దేశాన్ని, లక్ష్యాలను సాధించే విషయంలోనూ, ప్రణాళికలోని వివిధ ప్రాజెక్టులు, పథకాలవల్ల ప్రజలకు సాధ్యమైనంత హెచ్చు ప్రయోజనాలు సాధించి పెట్టే విషయంలోనూ కాంగ్రెసు అనుచరులు, మనపార్టీ అనుచరులు కలసి పనిచేయటానికి అవకాశముంది."

ఈ ముసాయిదా తీర్మానంలో కమ్యూనిస్టుపార్టీ సభ్యులకు ఈ దిగువ విజ్ఞప్తి చేశారు:

"కమ్యూనిస్టుపార్టీ సభ్యులంతా నిస్వార్థసేవాభావంతో, చొరవతో, త్యాగశీలురై ప్రపంచ శాంతికోసం, జాతీయ స్వాతంత్ర్య రక్షణకోసం, యావద్భారత జాతీయ ఐక్యతకోసం ప్రజలను సంఘటితపర్చి, వారిని సోషలిజం దిశగా, ఉజ్వలభవిష్యత్తువైపు నడపటంకోసం అకుంఠిత దీక్షతో పాటుబడుతూ, ఈ విషయాలలో రాజీపడని మహాశక్తి కమ్యూనిస్టుపార్టీ అని రుజువుచేయాలి."

# యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు తీర్మానాలు

క్విలన్, ఏప్రిల్ 7

యునైటెడ్ ట్రేడు యూనియన్ కాంగ్రెసు మూడవ మహాసభ నిన్న రాత్రితో ముగిసింది. మహాసభలో పౌరహక్కులు, పోలీసు కాల్పులు, ట్రేడ్ యూనియన్ హక్కులు, సుప్రీంకోర్టు నిర్ణయాలు, జీతాలు, ఆహార సమస్య, గోవా, ఆల్జీరియా, ఇండోనేషియా మున్నగు సమస్యలపై తీర్మానాలు చేశారు.

కార్మికులు పౌర హక్కులకోసం ఎడతెరిపిలేని పోరాటాలు సాగించాలని ఒక తీర్మానంలో కోరారు.

ఖడ్గపూర్, కాల్కా రైల్వే కార్మికులపైన, బొంబాయి బీడీ కార్మికులపైన, ఢిల్లీ పాకీపనివారిమీద జరిగిన పోలీసు కాల్పులనునిరసించారు.

బెంగాల్ మున్సిపల్ కార్మికులకు కనీస వేతన కమిటీ సిఫార్సులను అమలు జరపాలని కోరారు.

# రాజధాని విశేషాలు

## ఇబ్రాహింపట్నం డెవలప్‌మెంటు బ్లాకు

హైద్రాబాద్, ఏప్రిల్ 9

ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు మొన్న 8 వ తేదీన ఇబ్రాహింపట్నం జాతీయవికాస కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.

ఈ బ్లాకు 1957 అక్టోబరు 25 న మంజూరుచేశారు. ఇబ్రాహింపట్నం తాలూకాలో 140 గ్రామాలున్నాయి. జనాభా లక్షా అయిదువేలు, 3 మిడిల్ స్కూళ్లు, ఒక హైస్కూలు ఈ తాలూకాలో వున్నాయి.

## హైద్రాబాద్ గుమాస్తా సంఘం

హైద్రాబాద్ గుమాస్తా సంఘం సర్వసభ్య సమావేశం నిన్న సాయంత్రము శ్రీ మహేంద్రశాస్త్రి అధ్యక్షతను సమావేశమైంది. లేబరు పోలీసు క్రిమినల్ సంఘటనల్లో సంలీనంవల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందికనుక వాటిని వేర్వేరుగా వుంచాలని కోరారు. వేతన నిర్ణాయక సంఘం నివేదిక ప్రచురణలో జాప్యానికి విచారం వెలిబుచ్చారు. గుమస్తాలకు ఏడాదికి ఒక నెలజీతం బోనస్‌గా వచ్చేట్లు చూడాలని ప్రభుత్వాన్ని అర్థించారు.

## కిరణాపర్తక సంఘం

అక్ట్రాయ్ పన్నును రద్దుచేయాలని కోరుతూ హైద్రాబాద్ కిరాణా వర్తక సంఘంవారు ఒక ప్రకటన చేశారు. పల్లెలనుంచి వచ్చే సరుకుతో కిరాణా వర్తకులు వ్యాపారం చేయవలసి వుంటుందని వారన్నారు. కార్పొరేషనుకు తగు ధనంలేకపోతే దానికి ఇతర వనరులను వెతకడంలో కిరణా వర్తకులు తోడ్పడతారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జంటనగరాల ఆర్థికస్థితి

హైద్రాబాద్, ఏప్రిల్ 9

హైద్రాబాద్ సికింద్రాబాద్ కార్పొరేషన్ల ఆర్థిక వ్యవహారాలను గురించి ప్రణాళికా కార్యదర్శి శ్రీ సి.నరసింహంగారు తయారుచేసిన నివేదిక అందిందని ఆర్థిక మంత్రి బ్రహ్మానందరెడ్డిగారు నేడు వెల్లడించారు. ప్రభుత్వం త్వరలోనే ఈ నివేదికను ప్రకటించ గలదనీ, నివేదికలోని సిఫార్సుల నిప్పుడు పరిశీలిస్తున్నదనీ ఆయన చెప్పారు. (వి. వి.)

# కార్మికుల జీతాలలో పాతిక శాతం పెంచడం సాధ్యం కాదని శ్రీ గుల్జారీలాల్ నందా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

కార్మికుల జీతాలను వెంటనే నూటికి 25 వంతులు పెంచాలని దేశంలో అనేక కార్మిక సంస్థలు కోరుతున్న కోర్కెను అంగీకరించడానికి వీల్లేదని కార్మికమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా నేడు లోక్ సభలో కార్మికశాఖ పద్దుపై జరిగిన చర్చకు జవాబిస్తూ చెప్పారు.

ఇది న్యాయమైన కోర్కెకాదని ఆయన అన్నారు. అయితే కార్మికుల జీతాలను తగ్గించడానికి కూడా వీలు లేదని ఆయన చెప్పారు.

పరిశ్రమనుబట్టి ఆయా పరిశ్రమల జీతాల సమస్యను పరిశీలించవలసి వుంటుందన్నారు.

పారిశ్రామికేయుల వేతన నిర్ణాయక సంఘం సిఫార్సులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గురించి ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తున్నదన్నారు. ఒక జాతీయ ట్రిబ్యునల్‌ని స్థాపించి మరొక వేతనాల సంఘాన్ని కాని నియమించడం దీనికి ప్రతిక్రియ కాగలదనీ, అయితే దానివల్ల ఇంకా కొంత ఆలస్యం తప్పదనీ ఆయన అన్నారు. కార్మికశాఖ పారిశ్రామికేయులతోనూ పత్రికా యజమానులతోనూ సంప్రతింపులు జరుపనున్నదనీ, దీనివల్ల సత్ఫలితాలు కలగ గలవనే నమ్మకం తనకున్నదనీ ఆయన చెప్పారు.

అవకతవక నిర్వహణవల్ల మూతపడే పరిశ్రమల విషయంలో తగు చర్యలు తైకొనడానికి ప్రభుత్వం యోచిస్తున్నదని శ్రీ నందా చెప్పారు. అలాంటివాటిపైనగల రుణభారాన్ని తొలగించి వాటి కాళ్ళపై వాటిని నిలబెట్టవలసి వుంటుందన్నారు.

ఈ సంవత్సరం యజమానులూ కార్మికులూ నెరపుకొన్న సహకారానికి ఆయన అభినందించారు. కాని అవార్డులను ఒప్పందాలను అమలు పరచడంలో చాలా విలంబన జరుగుతున్నందుకు ఆయన విచారం వెలిబుచ్చారు. ట్రేడుయూనియన్ల మధ్య ఐక్యత కావాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# స్థానిక సంస్థలలో స్త్రీలకు ప్రాతినిధ్యం

హైద్రాబాదు, ఏప్రిల్ 9

అఖిల ఆంధ్ర ప్రదేశ్ మహిళా సంఘం తరఫున శ్రీమతి ఈశ్వరీబాయి నేడు ఆర్థిక మంత్రి బ్రహ్మానందరెడ్డిగారిని కలుసుకొని మహిళలకు స్థానిక సంస్థలలోనూ, కార్పొరేషన్‌లోనూ ప్రాతినిధ్యం యివ్వాలని కోరారు. మంత్రిగారు ఆమె చెప్పినదంతా విని ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తామన్నారు.

యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు నాయకులు కేంద్ర మంత్రి కార్మిక సంఘాన్ని నెలకొల్పడానికి నిశ్చయించారు.




మాజ్డా దీపములు

ఎక్కువ కాలము ప్రకాశవంతముగా వెలుగును

నియమించబడిన డీలర్లు:

రఘునాథ్ ట్రేడింగ్ కార్పొరేషన్, మెయిన్ రోడ్ - గుంటూరు

మాడ్ ఖండ్ ఎలక్ట్రికల్ స్టోర్స్, బీసెంటు రోడ్, గవర్నరుపేట - విజయవాడ-2

ప్రభాత్ ఎలక్ట్రికల్ స్టోర్స్, మెయిన్ రోడ్ - చీరాల

AIC 155 TE


# స్వతంత్ర రాజ్యంగా కాశ్మీరు మనలేదు

## ప్రధాని బక్షీ గులామ్ స్పష్టీకరణ

హైద్రాబాద్, ఏప్రిల్ 8

కాశ్మీరును స్వతంత్ర రాజ్యం చేయాలన్న ప్రతిపాదననూ, కాశ్మీరు భూభాగంలో విదేశ సైన్యాలను వుంచాలన్న సూచనను కాశ్మీరు ప్రధాని బక్షీ గులామ్ మహమ్మద్ పూర్తిగా వ్యతిరేకించారు.

ఇక్కడ జరిగిన పత్రికాగోష్ఠిలో విలేఖరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు.

కాశ్మీరు సరిహద్దులో రష్యా, చైనా, ఆఫ్ఘనిస్తాన్ మొదలుగాగల దేశాలున్నాయి. అక్కడ విదేశీ సైన్యాలను తెచ్చిపెట్టి వుంచడమంటే ప్రపంచంలో వున్న రెండురాజ్యాల కూటాలకుమధ్యగల అతిముఖ్యమైన తటస్థ భూభాగాన్ని లేకుండా చేయడమే కాగలదని ప్రధాని బక్షీ అన్నారు.

అలాగే కాశ్మీరు స్వతంత్ర రాజ్యంగా వుండాలన్న ప్రతిపాదనను తిరస్కరించుతూ బక్షీ ఇలా అన్నారు:

అతి సుందరమైన చిన్న కాశ్మీరు ఒకస్వతంత్రరాజ్యంగా వుండటానికి వీలుగాలేదు. స్వతంత్ర కాశ్మీరు రాజ్యం అగ్ర రాజ్యాల చేతుల్లో కీలుబొమ్మఅయ్యే ప్రమాదం వుంది. ఆ విధంగా అది ప్రపంచ శాంతికే ప్రమాదకరంగా పరిణమించవచ్చు.

తనకూ, షేక్ అబ్దుల్లాకు మధ్య సఖ్యత ఏర్పరచడానికి అశోకమెహతా ప్రయత్నం చేస్తున్నట్లు వెలువడిన వార్తలను గురించి విలేఖరులు ప్రశ్నించగా తనకా విషయమేమీ తెలియదన్నారు.

ఇటీవల ఆయన ప్రవర్తనపట్ల షేక్ అబ్దుల్లాపై ఏమైనా చర్యను తీసుకోవాలని ఆలోచించుతున్నారా అన్న ప్రశ్నకు బక్షీ సమాధానం చెపుతూ తాము పరిస్థితి నంతటినీ జాగ్రత్తగా పరిశీలించుతున్నామన్నారు. అవసరమైన ప్పుడు మాత్రమే చర్యను తీసుకోగలమన్నారు.

డాక్టర్ గ్రాహం నివేదికను బక్షీ ప్రస్తావించి ఇలా అన్నారు:

ఐరాప ప్రతినిధులు కాశ్మీరులో వున్నప్పుడు మాత్రంభారత దేశం తీసుకున్న వైఖరి న్యాయసమ్మతమైనదేనని పొగుడుకొంటారు. కాని అక్కడినుండి వెళ్ళిపోగానే ఇండియాను వ్యతిరేకంగా దీర్ఘమైన నివేదికలను తయారు చేస్తారు. ఇది చాల చిత్రమైన విషయం.

# యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు తీర్మానాలు

క్విలన్, ఏప్రిల్ 7

యునైటెడ్ ట్రేడు యూనియన్ కాంగ్రెసు మూడవ మహాసభ నిన్న రాత్రితో ముగిసింది. మహాసభలో పౌరహక్కులు, పోలీసు కాల్పులు, ట్రేడ్ యూనియన్ హక్కులు, సుప్రీంకోర్టు నిర్ణయాలు, జీతాలు, ఆహార సమస్య, గోవా, ఆల్జీరియా, ఇండోనేషియా మున్నగు సమస్యలపై తీర్మానాలు చేశారు.

కార్మికులు పౌర హక్కులకోసం ఎడతెరిపిలేని పోరాటాలు సాగించాలని ఒక తీర్మానంలో కోరారు.

ఖడ్గపూర్, కాల్కా రైల్వే కార్మికులపైన, బొంబాయి బీడీ కార్మికుల మీద, ఢిల్లీ పాకీపనివారిమీద జరిగిన పోలీసు కాల్పులనునిరసించారు.

బెంగాల్ మున్సిపల్ కార్మికులకు కనీస వేతన కమిటీ సిఫార్సులను అమలు జరపాలని కోరారు.

ప్రత్యేక వేడుక సమయాలకోసం మేక్రోపోలోస్

గోల్డ్ టిప్డ్

బ్రౌన్ పరిమళ

సిగరెట్లు

టి. మేక్రోపోలో అండ్ కో (ప్రైవేట్) లిమిటెడ్,

బొంబాయి

కంకర్లు

మ్యాచ్ లు

MACROPOLOS BROWN PERFUMED CIGARETTES


సంపాదకవర్గం: నుద్దుపూరి సంద్రశేఖరరావు (అధ్యక్షులు); కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరుబలరామమూర్తి - ఎడిటర్, ప్రింటర్ & పబ్లిషర్: విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ-2.